మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

ఆదివారం SUNDAY 20-9-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 12 PAGES:12 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 2 Volume:2 | సంచిక: 82 Issue: 82

Circulated to Telangana
Published from Jagitial


20 సెప్టెంబర్ 2026 - ఆదివారం శ్రీ పరాభవ నామ సంవత్సరం దక్షిణాయనం - వర్ష ఋతువు భాద్రపద మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:08 సూర్యాస్తమయం - సా. 6:10 తిథి నవమి సా. 5:50 వరకు తరువాత దశమి సంస్కృత వారం భాను వాసరః నక్షత్రం పూర్వాషాఢ తె. 4:260 వరకు తరువాత ఉత్తరాషాఢ యోగం సౌభాగ్య మ. 3:19 వరకు కరణం కౌలవ సా. 5:50 వరకు తైతుల ఉ. 6:590 వరకు వర్జ్యం మ. 12:26 నుండి మ. 2:13 వరకు దుర్ముహూర్తం సా. 4:34 నుండి సా. 5:22 వరకు రాహుకాలం సా. 4:40 నుండి సా. 6:10 వరకు యమగండం మ. 12:09 నుండి మ. 1:39 వరకు గుళికాకాలం మ. 3:10 నుండి సా. 4:40 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:32 నుండి తె. 5:20 వరకు అమృత ఘడియలు రా. 11:11 నుండి రా. 12:59 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:45 నుండి మ. 12:33 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున



# తిరుమలలో వైభవంగా గరుడ సేవ

## లక్షలాది మంది భక్తులతో పోటెత్తిన మాఢవీధులు.. గరుడ వాహనంపై దర్శనమిచ్చిన మలయప్ప స్వామి

తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో అత్యంత కీలక ఘట్టమైన గరుడ వాహన సేవ శనివారం రాత్రి అంగరంగ వైభవంగా, కన్నుల పండువగా జరిగింది. గరుత్మంతునిపై శ్రీదేవి, భూదేవి సమేతంగా కొలువైన శ్రీ మలయప్పస్వామి వారు తిరుమాడ వీధుల్లో విహరిస్తూ లక్షలాది మంది భక్తులకు అభయమిచ్చారు. ఈ అపురూప దృశ్యాన్ని కనులారా వీక్షించేందుకు తరలివచ్చిన భక్తుల "గోవిందా.. గోవిందా.." నామస్మరణలతో సప్తగిరులు మార్మోగాయి. శనివారం సాయంత్రం 6:30 గంటలకు వాహన మండపం నుంచి గరుడ వాహనంపై స్వామివారు బయటకు రాగానే, మాడ వీధుల్లోని గ్యాలరీలలో వేచి ఉన్న భక్తుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి.

తిరుమల, సెప్టెంబర్ 19 (ఈవార్తలు): గజరాజులు ముందు నడుస్తుండగా, భజన బృందాలు, కోలాటాలు, జీయంగార్ల ఘోష్టి, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి ఊరేగింపు అత్యంత భక్తిశ్రద్ధలతో సాగింది. భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు సమర్పిస్తూ స్వామివారిని దర్శించుకుని పులకించిపోయారు. గరుడ సేవను తిలకించేందుకు దేశం నలుమూలల నుంచి లక్షలాదిగా భక్తులు తరలివచ్చారు. మాడ వీధుల్లోని 1.90 లక్షల మంది సామర్థ్యం గల గ్యాలరీలు శుక్రవారం రాత్రికే భక్తులతో కిక్కిరిసిపోయాయి. గ్యాలరీలలో వేచి ఉన్న భక్తులకు టీటీడీ శనివారం ఉదయం నుంచే పాలు, అన్నప్రసాదాలు, తాగునీరు, అల్పాహారం వంటివి నిరంతరాయంగా అందించింది. సుమారు 2000 మంది శ్రీవారి సేవకులు ఈ పంపిణీ కార్యక్రమాల్లో పాల్గొని భక్తులకు సేవలందించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా టీటీడీ ఛైర్మన్ బి.ఆర్. నాయుడు, ఈవో ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి స్వయంగా మాడ వీధుల్లో పర్యటించి ఏర్పాట్లను పర్యవేక్షించారు. జేఈవోలు శరత్, తరువాయి 2 వ పేజీలో...

# కేసీఆర్ పాటలతో భయపడ్డారా..!



## అందుకే డీజేలపై రేవంత్ సర్కారు నిషేధం?

గత ఏడాది రేవంత్ ట్యాంక్‌బండ్ పర్యటనలో బీఆర్ఎస్ పాటలు

అందుకే ఈ ఏడాది ట్యాంక్‌బండ్‌లో నిమజ్జనాలు నిషేధం?

హైకోర్టు తీర్పు అడ్డుగా పెట్టి బ్యాన్ విధిస్తున్నారని ఆరోపణలు

సోషల్ మీడియాలో జోరుగా రాజకీయ చర్చ

(ఈవార్తలు-పొలిటికల్ డెస్క్)

గణేశ్ నిమజ్జనాల వేళ హైదరాబాద్ ట్యాంక్‌బండ్ మరోసారి రాజకీయ చర్చకు వేదికగా మారింది. ట్యాంక్‌బండ్‌పై గణేశ్ విగ్రహాల నిమజ్జనానికి అధికారులు ఆంక్షలు విధించడం, ఇందుకు తెలంగాణ హైకోర్టు ఆదేశాలను కారణంగా చూపించడం నేపథ్యంలో సోషల్ మీడియాలో మరో వాదన తెరపైకి వచ్చింది. "కేసీఆర్ పాటలకు రేవంత్ ప్రభుత్వం భయపడిందా?" అంటూ పలువురు సామాజిక మాధ్యమాల్లో ప్రశ్నిస్తున్నారు. గత ఏడాది గణేశ్ నిమజ్జనాల సందర్భంగా ట్యాంక్ బండ్ పరిసరాల్లో బీఆర్ఎస్‌కు అనుకూలంగా ఉన్న పాటలు వినిపించాయంటూ సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం జరిగింది. రేవంత్‌రెడ్డి ట్యాంక్‌బండ్ పర్యటనకు సంబంధించిన ఓ వీడియోలో బీఆర్ఎస్ పాటలు వినిపించినట్లు సోషల్ మీడియా తరువాయి 2 వ పేజీలో...

# నోటుకే ఓటు!

## యూపీఐ చెల్లింపులు స్వీకరించం.. నగదు ఉంటేనే సరుకు అమ్మకాలు

### షాపుల ముందు వెలుస్తున్న నోటీసులు.. ఎండీఆర్‌పై గళమెత్తుతున్న వ్యాపారులు

న్యూఢిల్లీ: దేశంలో డిజిటల్ చెల్లింపుల విప్లవానికి కారణమైన యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ)పై కొత్తగా ఛార్జీలు విధించాలన్న ప్రతిపాదన వ్యాపారుల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తోంది. దేశంలోని చాలా ప్రాంతాల్లో అక్టోబర్ 15 కంటే ముందే అంటే.. ఇప్పటి నుంచే దుకాణాల ముందు 'యూపీఐ చెల్లింపులు స్వీకరించబోం' అంటూ నోటీసులు అంటిస్తున్నారు. ఎండీఆర్ పేరుతో అదనపు చార్జీలు భరించేందుకు తాము సిద్ధంగా లేమని స్పష్టం చేస్తున్నారు. ఈ చార్జీలను ప్రభుత్వం వ్యాపారుల నుంచే వసూలు చేస్తుందని చెప్పినప్పటికీ, ఇది పరోక్షంగా వినియోగదారులపై ప్రభావం చూపుతుందని స్పష్టం చేస్తున్నారు. అందుకే, అక్టోబర్ 15 నుంచి రూ.2,000కు మించిన కొనుగోళ్లకు నగదు తీసుకురావాలని వినియోగదారులకు సూచిస్తున్నారు. ఈ కొత్త చార్జీల భారాన్ని తాము భరించలేమని, అందుకే పెద్ద మొత్తంలో తరువాయి 2 వ పేజీలో...






# తెలుగు రాష్ట్రాలకు భారీ వర్షాలు!

## బంగాళాఖాతంలో అల్పపీడనం

తెలంగాణలో పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్

కోస్తాంధ్రలో భారీ వర్షాలు కురిసే అవకాశం

హైదరాబాద్, వైజాగ్, సెప్టెంబర్ 19 (ఈవార్తలు): వర్షాల కోసం ఎదురుచూస్తున్న తెలంగాణకు భారత వాతావరణ శాఖ (ఐఎండీ) చల్లటి కబురు అందించింది. రాష్ట్రంలో ఈ నెల 24 వరకు పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఈ మేరకు పలు జిల్లాలకు ఎల్లో తరువాయి 2 వ పేజీలో...




**బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)**

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,584 |
| వెండి (కిలో): | రూ.2,,60,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,542 |



# వంటగ్యాస్ సబ్సిడీకి బయోమెట్రిక్ తప్పనిసరి

న్యూఢిల్లీ: దేశీయ వంటగ్యాస్ (ఎల్పీజీ) వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వం కీలక ఆదేశాలు జారీ చేసింది. రాయితీ ధరపై వంటగ్యాస్ సిలిండర్లను పొందేందుకు 2026 అక్టోబర్ 1 నాటికి బయోమెట్రిక్ ఆధార్ ప్రామాణీకరణ (బీఏఏ) ప్రక్రియను పూర్తి చేయడం తప్పనిసరి అని స్పష్టం చేసింది. ఈ మేరకు కేంద్ర పెట్రోలియం, సహజవాయువు మంత్రిత్వ శాఖ శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది. అర్హులైన కుటుంబాలకు మాత్రమే సబ్సిడీ ప్రయోజనాలు అందేలా చూడటంతో పాటు, గృహ అవసరాల సిలిండర్లు వాణిజ్య, పారిశ్రామిక రంగాలకు తరువాయి 2 వ పేజీలో...




# 51,000 మందికి ఉద్యోగాలు

## నియామక పత్రాలు అందజేసిన ప్రధాని మోదీ

### ఘనంగా 20వ రోజ్‌గార్ మేళా.. భారత యువత సత్తాకు స్టార్టప్‌లే నిదర్శనం: మోదీ

భారత యువత సామర్థ్యానికి, సత్తాకు దేశంలోని స్టార్టప్ వ్యవస్థే గొప్ప ఉదాహరణ అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఒకప్పుడు కేవలం పెద్ద నగరాలకే పరిమితమైన స్టార్టప్‌ల కథ ఇప్పుడు చిన్న పట్టణాలకు, నగరాలకు కూడా విస్తరించిందని ఆయన పేర్కొన్నారు.

న్యూఢిల్లీ: 20వ రోజ్‌గార్ మేళా సందర్భంగా శనివారం ఆయన వివిధ ప్రభుత్వ సంస్థలకు కొత్తగా ఎంపికైన యువతను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో దేశవ్యాప్తంగా 45 ప్రాంతాల నుంచి 51,000 మందికి పైగా యువతకు నియామక పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ.. "భారతదేశం నేడు ప్రపంచంలోనే మూడో అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థగా నిలిచింది. గుర్తించబడిన స్టార్టప్‌లలో దాదాపు తరువాయి 2 వ పేజీలో...

# భారత్‌పై 100% టారిఫ్స్

## రష్యా ఆంక్షల బిల్లుపై ట్రంప్ సంతకం

వాషింగ్టన్: ఉక్రెయిన్‌తో సుదీర్ఘకాలం యుద్ధం కొనసాగిస్తోన్న మాస్కోపై ఆర్థిక ఒత్తిడిని మరింత పెంచే లక్ష్యంతో రూపొందించిన రష్యా ఆంక్షల బిల్లుపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంతకం చేశారు. రిపబ్లికన్ల ఆధ్వర్యంలోని ప్రతినిధుల సభ 262-159 ఓట్ల తేడాతో ఈ ఆంక్షల బిల్లును ఆమోదించిన విషయం తెలిసిందే. దీంతో ఈ బిల్లుకు ట్రంప్ కూడా ఆమోదముద్ర వేశారు. అధ్యక్షుడి సంతకంతో ఈ బిల్లు చట్టరూపం దాల్చింది. రష్యాపై కఠినమైన ఆర్థిక ఆంక్షలు విధించడంతో పాటు, ఆ దేశం నుంచి చమురు కొనుగోలు చేసే భారత్, చైనా వంటి దేశాలపై భారీ సుంకాలు విధించే అధికారాన్ని ఈ చట్టం అధ్యక్షుడికి కల్పిస్తోంది. దీంతో రష్యా నుంచి చమురు, గ్యాస్ కొనుగోలు చేస్తున్న దేశాలపై ఏ క్షణమైనా సుంకాలు ప్రకటించే అవకాశం ఉంది. పాశ్చాత్య దేశాల ఆంక్షలను పక్కనపెట్టి రష్యా నుంచి అత్యధికంగా ముడి చమురు, సహజ తరువాయి 2 వ పేజీలో...



## విశ్వవాణి



మెదడులోని లోతైన ప్రాంతాలను శస్త్రచికిత్స లేకుండానే ప్రభావితం చేసే ప్రయోగాత్మక అల్ట్రాసౌండ్ హెల్మెట్‌ను పరిశోధకులు అభివృద్ధి చేశారు. ఈ పరికరంలో 256 అల్ట్రాసౌండ్ ఉద్గారకాలు కలిసి పనిచేసి, పుర్రెను దాటి నిర్దిష్ట మెదడు ప్రాంతంపై శబ్ద తరంగాలను కేంద్రీకరిస్తాయి. ఆరోగ్యవంతులపై నిర్వహించిన తొలి పరీక్షల్లో చూపు సంబంధిత చిన్న మెదడు ప్రాంతాన్ని కచ్చితంగా లక్ష్యంగా చేసుకుని, అక్కడి నాడీకణాల కార్యకలాపాల్లో మార్పులు తీసుకురాగలిగారు. క్రియాత్మక ఎంఆర్ఐతో మెదడులో జరుగుతున్న మార్పులను ప్రత్యక్షంగా గమనించి, నిర్దేశించిన ప్రాంతాన్నే ప్రభావితం చేస్తున్నట్లు నిర్ధారించారు.

# వరంగల్ ఎయిర్‌పోర్టుకు పేరు చెప్పండి

## ప్రజలను కోరిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

### రుద్ర, కాకతీయ, సమ్మక్క-సారలమ్మ పేర్లు వైరల్

హైదరాబాద్, సెప్టెంబర్ 19 (ఈవార్తలు): వరంగల్ (మామునూరు) విమానాశ్రయానికి సముచితమైన పేరును సూచించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలను కోరారు. ఈ మేరకు ఆయన శనివారం సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ఒక పోస్ట్ చేశారు. దశాబ్దాలుగా పెండింగులో ఉన్న ఈ ప్రాజెక్టును తమ ప్రజా ప్రభుత్వం సాకారం చేస్తోందని ఆయన పేర్కొన్నారు. విమానాశ్రయ నిర్మాణానికి అవసరమైన భూసేకరణ కోసం రూ. 295 కోట్లు కేటాయించి, ఆ భూమిని ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాకు (ఏఏఐ) అప్పగించినట్లు తెలిపారు. ఇది తరువాయి 2 వ పేజీలో...





# టాక్ ఆఫ్ ది స్టేట్: సర్వే నం.325

## ఎర్రవల్లి భూముల సర్వేలో మరో ట్విస్ట్

ఎర్రవల్లి 325 సర్వే నంబర్‌పై కొనసాగుతున్న పరిశీలన

మొత్తం 388 ఎకరాల భూములపై అధికారుల సర్వే

180 ఎకరాలు తమవేనంటున్న వెంకటాపూర్ రైతులు

పాత ఖాస్రా, సేత్వార్ రికార్డులు పరిశీలించాలని డిమాండ్

సిద్దిపేట, సెప్టెంబర్ 19 (ఈవార్తలు): మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కు చెందిన ఎర్రవల్లి ఫామ్‌హౌస్ సమీపంలోని ప్రభుత్వ భూముల సర్వేలో కీలక పరిణామం చోటుచేసుకుంది. సిద్దిపేట జిల్లా మార్కూక్ మండలం ఎర్రవల్లి గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 325లో ఉన్న 388 ఎకరాల భూమిపై రెవెన్యూ, సర్వే అధికారులు చేపట్టిన సర్వే మూడో రోజుకు చేరుకోగా, ఈ వివాదంలోకి పొరుగున ఉన్న వెంకటాపూర్ గ్రామస్థులు ప్రవేశించారు. సర్వే చేస్తున్న భూమిలో తమ వాటా కూడా తరువాయి 2 వ పేజీలో...

# సుప్రీంకు దానం

## హైకోర్టు తీర్పుపై సవాల్



హైదరాబాద్, సెప్టెంబర్ 19 (ఈవార్తలు): ఖైరతాబాద్ ఎమ్మెల్యేగా తనపై అనర్హత వేటు వేస్తూ తెలంగాణ హైకోర్టు వెలువరించిన తీర్పును దానం నాగేందర్ సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. శనివారం మధ్యాహ్నం ఆయన సర్వోన్నత తరువాయి 2 వ పేజీలో...

## రాశి ఫలాలు

20.9.2026

**మేషం:** సోదరులతో ఆస్తి వివాదాలు పరిష్కారమౌతాయి. సన్నిహితులతో సఖ్యత కలుగుతుంది. వృత్తి, వ్యాపారాలలో ఆశించిన పురోగతి సాధిస్తారు. దూరప్రాంతాల బంధువుల నుంచి శుభవార్తలు అందుతాయి. ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉంటుంది.

**వృషభం:** ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. వ్యాపార, ఉద్యోగాలలో కొద్దిపాటి చికాకులు తప్పవు. చేపట్టిన పనులు ముందుకు సాగవు. దూర ప్రయాణాల వలన శ్రమాధిక్యత పెరుగుతుంది. బంధువులతో స్వల్ప వివాదాలు ఉంటాయి. ఆర్థిక విషయాలు నిరుత్సాహపరుస్తాయి.

**మిధునం:** చేపట్టిన పనుల్లో విజయం సాధిస్తారు. చిన్ననాటి మిత్రుల కలయిక ఆనందం కలిగిస్తుంది. వృత్తి, వ్యాపారాలు ఉత్సాహంగా సాగుతాయి. కుటుంబ సభ్యులతో శుభకార్యాలలో పాల్గొంటారు. మొండి బాకీలు వసూలవుతాయి. ఉద్యోగ ప్రయత్నాలు అనుకూలంగా సాగుతాయి.

**కర్కాటకం:** విద్యార్థులకు నిరుత్సాహం తప్పదు. మిత్రులతో అకారణ వివాదాలు కలుగుతాయి. చేపట్టిన పనులలో శ్రమ పెరుగుతుంది. వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి. వృత్తి ఉద్యోగాలలో అదనపు బాధ్యతలు వలన మానసిక ప్రశాంతత ఉండదు. ఆరోగ్య విషయంలో మరింత అప్రమత్తంగా వ్యవహరించాలి.

**సింహం:** కుటుంబ వ్యవహారాలలో కీలక నిర్ణయాలు అమలు చేస్తారు. నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. బంధువులతో వివాదాలు పరిష్కార దిశగా సాగుతాయి. వ్యాపార, ఉద్యోగాలలో ప్రోత్సాహకర వాతావరణం ఉంటుంది. సన్నిహితుల నుండి శుభవార్తలు అందుతాయి. ఆర్థిక వ్యవహారాలు ఆశాజనకంగా సాగుతాయి.

**కన్య:** గృహమున చిత్రమైన సంఘటనలు చోటుచేసుకుంటాయి. సమాజంలో ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. వృత్తి, వ్యాపారాలలో ఆశించిన పురోగతి సాధిస్తారు. ఆర్థిక విషయాలు సంతృప్తినిస్తాయి. విలువైన వస్తువులు బహుమతులుగా పొందుతారు.

**తుల:** విద్యార్థుల ప్రయత్నాలు కొంత నిరాశ కలిగిస్తాయి. చేపట్టిన వ్యవహారాలలో స్వల్ప ఆటంకాలు ఉంటాయి. వృత్తి, వ్యాపారాలలో గందరగోళ పరిస్థితులు ఉంటాయి. నిరుద్యోగులకు ఒక వార్త ఊరటనిస్తుంది. ఆర్థిక లావాదేవీలు మందగిస్తాయి. వృత్తి ఉద్యోగాలలో శ్రమ పెరుగుతుంది.

**వృశ్చికం:** ఇంటా బయట బాధ్యతలు మరింత పెరుగుతాయి. చేపట్టిన పనులలో వ్యయప్రయాసలు అధికమవుతాయి. వృధా ఖర్చులు పెరుగుతాయి. కుటుంబ సభ్యులతో వివాదాలు మానసిక సమస్యలు కలిగిస్తాయి. కుటుంబ వ్యవహారాలలో స్వంత ఆలోచనలు కలసిరావు.

**ధనస్సు:** వ్యాపార, ఉద్యోగాలలో ఆశించిన పురోగతి కనిపిస్తుంది. నిరుద్యోగులకు నూతన అవకాశాలు లభిస్తాయి. చేపట్టిన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. స్థిరాస్తి క్రయ విక్రయాలలో లాభాలు అందుకుంటారు. కుటుంబ సభ్యులతో శుభకార్యాల్లో పాల్గొంటారు. ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉంటుంది.

**మకరం:** సన్నిహితులతో విందువినోద కార్యక్రమాలలో పాల్గొంటారు. నిరుద్యోగులకు నూతన ఉద్యోగయోగం ఉన్నది. వృత్తి, వ్యాపారాలు ఆశించిన విధంగా ముందుకు సాగుతాయి. సన్నిహితులతో వివాదాలు తీరతాయి. నూతన భూములు, వాహనాలు కొనుగోలు చేస్తారు.

**కుంభం:** కుటుంబ సభ్యులతో ఊహించని వివాదాలు కలుగుతాయి. వృత్తి, వ్యాపారాలలో చికాకులు పెరుగుతాయి. ఆర్థిక లావాదేవీలు మందకొడిగా సాగుతాయి. వృధా ఖర్చులు పెరుగుతాయి. ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. ఉద్యోగ వాతావరణం సమస్యాత్మకంగా ఉంటుంది.

**మీనం:** ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. చేపట్టిన పనుల్లో స్వల్ప ఆటంకాలు తప్పవు. ఆర్థిక ఇబ్బందులుంటాయి. వృత్తి, వ్యాపారాలలో నిరుత్సాహ వాతావరణం ఉంటుంది. కుటుంబ సభ్యులతో మాటపట్టింపులు చికాకు పరుస్తాయి. నూతన ఋణ ప్రయత్నాలు చేస్తారు.

# కేసీఆర్ పాటలతో భయపడ్డారా..!

**మొదటి పేజీ తరువాయి**

కోడై కూసింది. ఇప్పుడు 2026 గణేశ్ నిమజ్జనాల సందర్భంగా ట్యాంక్‌బండ్‌పై నిమజ్జనాలకు అనుమతి లేదంటూ పోలీసులు, జీహెచ్ఎంసీ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం కొత్త రాజకీయ చర్చకు దారితీసింది. అధికారులు హైకోర్టు ఆదేశాలను ప్రస్తావిస్తున్నారు. 2021లోనే తెలంగాణ హైకోర్టు ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను హుస్సేన్‌సాగర్‌లో నిమజ్జనం చేయడంపై ఆంక్షలు విధించింది. అనంతరం కూడా ఈ అంశంపై న్యాయస్థానం తన ఆదేశాలను పునరుద్ఘాటించింది.

### అసలు నిషేధం దేనిపై?

ఇక్కడే అసలు వివాదం మొదలవుతోంది. ట్యాంక్‌బండ్‌పై నిమజ్జనాలకు ఆంక్షలు విధించడాన్ని కొందరు "హుస్సేన్‌సాగర్‌లో నిమజ్జనాలపై పూర్తి నిషేధం"గా ప్రచారం చేస్తుండగా, అధికారులు మాత్రం ప్రత్యామ్నాయ నిమజ్జన ప్రాంతాలను సూచిస్తున్నారు. నెక్లెస్ రోడ్, ఎన్టీఆర్ మార్గ్, పీపుల్స్ ప్లాజా పరిసరాల్లో నిమజ్జన ఏర్పాట్లు చేసినట్లు సమాచారం. ట్యాంక్‌బండ్ రహదారి భాగంలో నేరుగా విగ్రహాలను సరస్సులోకి దింపకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. అంటే, హుస్సేన్‌సాగర్ మొత్తంలోనే నిమజ్జనాలను నిలిపివేశారా? లేక ట్యాంక్‌బండ్ నుంచి నేరుగా నిమజ్జనం చేయడాన్నే నిరోధిస్తున్నారా? అన్నది ఈ వివాదంలో కీలకమైన అంశంగా మారింది.

### కేసీఆర్ పాటల అంశం తెరపైకి

ఇదే సమయంలో సోషల్ మీడియాలో కొందరు మరో కోణాన్ని ముందుకు తెస్తున్నారు. గతంలో గణేశ్ నిమజ్జన ఊరేగింపుల్లో బీఆర్ఎస్ పాటలు, ముఖ్యంగా కేసీఆర్–బీఆర్ఎస్ రాజకీయ ప్రచారంతో ముడిపడిన పాటలు పెద్దఎత్తున వినిపించిన నేపథ్యంలోనే ఈసారి ట్యాంక్‌బండ్ వద్ద నిమజ్జనాలను నియంత్రిస్తున్నారా? అని వారు ప్రశ్నిస్తున్నారు. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే.. గత ఏడాది ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా గణేశ్ నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు. ట్యాంక్‌బండ్‌తో పాటు ఇతర ప్రాంతాల్లో ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేసిందని, భక్తులు ప్రశాంతంగా నిమజ్జన కార్యక్రమాన్ని పూర్తి చేసుకోవాలని అప్పట్లో పిలుపునిచ్చారు. ఈ ఏడాది కూడా గణేశ్ ఉత్సవాలకు ఎలాంటి ఆటంకం కలగకూడదని అధికారులను సీఎం ఆదేశించినట్లు వార్తలు వచ్చాయి. భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని, నిమజ్జనాలకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. అందువల్లే ఇప్పుడు సోషల్ మీడియాలో వినిపిస్తున్న "కేసీఆర్ పాటలకు భయపడి ట్యాంక్‌బండ్‌ను మూసేశారా?" అనే చర్చ మొదలైంది.

### కోర్టు ఆదేశాల పేరుతో రాజకీయం

ట్యాంక్‌బండ్‌పై నిమజ్జనాల నిషేధానికి హైకోర్టు ఆదేశాలను అధికారులు కారణంగా చూపుతున్న నేపథ్యంలో మరో ప్రశ్న కూడా తలెత్తుతోంది. న్యాయస్థానం ఆదేశాలను ప్రభుత్వం అమలు చేస్తోందా? లేక ఆ ఆదేశాలను ఆసరాగా చేసుకుని ప్రభుత్వం తనకు అనుకూలమైన విధానాన్ని అమలు చేస్తోందా? దీనిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని గణేశ్ ఉత్సవ నిర్వాహకులు, రాజకీయ వర్గాల్లో కొందరు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు పర్యావరణ పరిరక్షణ, సరస్సు కాలుష్యం, భారీ రద్దీ, భద్రత వంటి అంశాలను దృష్టిలో పెట్టుకుని నిమజ్జనాలను క్రమబద్ధీకరించడం అవసరమని అధికారులు చెప్తున్నారు. మొత్తానికి.. ట్యాంక్‌బండ్ నిమజ్జనాలపై ఈసారి తీసుకున్న నిర్ణయం వెనుక కోర్టు ఆదేశాలే ప్రధాన కారణమా? లేక కేసీఆర్ పాటలకు భయపడ్డారా? అన్నది చర్చ విస్తృతంగా నడుస్తోంది.





# 51,000 మందికి ఉద్యోగాలు

**మొదటి పేజీ తరువాయి**

సగం టైర్–2, టైర్–3 నగరాల్లోనే ఉన్నాయి. ఇది భారతదేశ నూతన ఆర్థిక వ్యవస్థలో గ్రామాలు, పట్టణాలు, చిన్న నగరాల నుంచి వచ్చిన యువత కూడా కీలక పాత్ర పోషిస్తున్నారని చూపిస్తోంది" అని వివరించారు. చిన్న పట్టణాలకు చెందిన యువత తమ సొంత ఆలోచనలతో కొత్త కంపెనీలను స్థాపిస్తూ, తమతో పాటు ఇతర యువతకు ఉపాధి అవకాశాలను సృష్టిస్తున్నారని ప్రశంసించారు. ప్రభుత్వ రంగంతో పాటు ప్రైవేటు రంగంలోనూ ఉపాధి అవకాశాలను వేగంగా విస్తరించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని మోదీ స్పష్టం చేశారు. "ఈ లక్ష్యంతోనే సుమారు రూ. 1 లక్ష కోట్లతో 'ప్రధానమంత్రి వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన'ను ప్రారంభించాం. ఈ పథకం ద్వారా దాదాపు 2 కోట్ల మంది యువత తొలిసారిగా ఉద్యోగ రంగంలోకి ప్రవేశించే అవకాశం లభిస్తుంది. మొదటిసారి ఉద్యోగంలో చేరేవారికి రూ. 15,000 వరకు ప్రోత్సాహకం అందించడంతో పాటు, కొత్త ఉద్యోగాలను సృష్టించే యాజమాన్యాలకు కూడా ప్రోత్సాహకాలు ఉంటాయి" అని తెలిపారు. ప్రభుత్వ వ్యవస్థలో భాగం కాబోతున్న నూతన ఉద్యోగులకు ప్రధాని కీలక సూచనలు చేశారు. "మీరు, మీ తల్లిదండ్రులు ఎదుర్కొన్న ఇబ్బందులు, కష్టాలు దేశంలోని ఏ పౌరుడూ ఎదుర్కోకుండా చూడటమే మీ లక్ష్యం కావాలి. ప్రభుత్వ సేవలో చేరిన వెంటనే ఈ మిషన్‌ను మీరు చేపట్టాలి" అని పిలుపునిచ్చారు. నిరంతరం నేర్చుకోవడం, కొత్త నైపుణ్యాలు, టెక్నాలజీని అందిపుచ్చుకోవడం చాలా ముఖ్యమని ఆయన అన్నారు. ఇందుకోసం 'మిషన్ కర్మయోగి'ని రూపొందించినట్లు తెలిపారు. ఇప్పటికే 1.70 కోట్ల మంది ప్రభుత్వ ఉద్యోగులు 'ఐ+గా కర్మయోగి' ప్లాట్‌ఫామ్‌లో చేరారని, కొత్తగా చేరే వారి కోసం 'కర్మయోగి ప్రారంభ్' అనే ప్రత్యేక కార్యక్రమాన్ని సిద్ధం చేశామని వివరించారు. మీరు మిమ్మల్ని ఎంతగా మెరుగుపరుచుకుంటే, దేశ పౌరులకు అంత మెరుగైన సేవలు అందించగలరని ప్రధాని పేర్కొన్నారు.

# సుప్రీంకు దానం

**మొదటి పేజీ తరువాయి**

న్యాయస్థానంలో స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్ఎల్‌పీ) దాఖలు చేశారు. బీఆర్ఎస్ తరపున గెలిచి, ఆ తర్వాత కాంగ్రెస్‌లో చేరిన దానం నాగేందర్‌పై శుక్రవారం హైకోర్టు అనర్హత వేటు వేసిన విషయం విదితమే. సాంకేతికంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా కొనసాగుతూనే 2024 లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేయడం పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం కిందకు వస్తుందని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ మేరకు ఆయన శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేస్తూ తీర్పునిచ్చింది. ఈ అనర్హత 2024 ఏప్రిల్ 23వ తేదీ నుంచే వర్తిస్తుందని న్యాయస్థానం తన తీర్పులో పేర్కొంది. దానం నాగేందర్‌పై దాఖలైన అనర్హత పిటిషన్లను తిరస్కరిస్తూ గతంలో స్పీకర్ తీసుకున్న నిర్ణయాన్ని హైకోర్టు కొట్టివేసింది. ఈ తీర్పుతో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ అయినట్లుగా పరిగణించాలని, తీర్పు ప్రతులను స్పీకర్ కార్యాలయానికి, ఎన్నికల సంఘానికి పంపాలని ఆదేశాలు జారీ చేసింది. మరోవైపు, ఇదే వ్యవహారంలో బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఇప్పటికే సుప్రీంకోర్టులో కేవియట్ పిటిషన్లు దాఖలు చేశారు. ఈ అంశంపై తమ వాదనలు వినకుండా ఎలాంటి ఏకపక్ష నిర్ణయం తీసుకోవద్దని వారు అత్యున్నత న్యాయస్థానాన్ని కోరారు.

# భారత్‌పై 100% టారిఫ్స్

**మొదటి పేజీ తరువాయి**

వాయువును కొనుగోలు చేసే టాప్–5 దేశాల నుంచి అమెరికాలోకి దిగుమతి అయ్యే వస్తువులపై గరిష్ఠంగా 100 శాతం వరకు అదనపు సుంకాలు విధించే విస్తృత అధికారాన్ని ఈ చట్టం ట్రంప్‌నకు కల్పిస్తుంది. భారత్‌తోపాటూ చైనా, స్లోవేకియా, హంగేరి, అజర్‌బైజాన్ దేశాలు మాస్కో నుంచి అత్యధికంగా చమురు దిగుమతి చేసుకుంటున్నాయి.

# తెలుగు రాష్ట్రాలకు భారీ వర్షాలు!

**మొదటి పేజీ తరువాయి**

అలర్ట్ జారీ చేసింది. బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడిందని, అది బలపడి దక్షిణ ఒడిశా–ఉత్తర ఆంధ్ర తీరాల వైపు కదులుతుందని, దీని ప్రభావంతో తెలంగాణలో వర్షాలు పుంజుకుంటాయని అంచనా వేసింది. ఈ వానాకాలంలో ఇప్పటివరకు రాష్ట్రంలో సాధారణం కన్నా 19 శాతం లోటు వర్షపాతం నమోదైంది. ఈ కొత్త అల్పపీడనంతో ఆ లోటు కొంతవరకు భర్తీ అయ్యే అవకాశం కనిపిస్తోంది. ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, సిద్దిపేట, మెదక్, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. అటు.. కోస్తాంధ్రలో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. ప్రజలు, ముఖ్యంగా మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

# టాక్ ఆఫ్ ది స్టేట్: సర్వే నం.325
## ఎర్రవల్లి భూముల సర్వేలో మరో ట్విస్ట్

**మొదటి పేజీ తరువాయి**

ఉందని వారు కొత్త వాదనను తెరపైకి తెచ్చారు. వివరాల్లోకి వెళితే, సర్వే నంబర్ 325 కింద ఉన్న మొత్తం 388 ఎకరాల భూమిలో కేవలం 250 ఎకరాలు మాత్రమే ఎర్రవల్లికి చెందినవని, మిగిలిన సుమారు 180 ఎకరాలు తమ వెంకటాపూర్ గ్రామ పరిధిలోకి వస్తాయని గ్రామస్థులు చెబుతున్నారు. గతంలో రెవెన్యూ అధికారులు పొరపాటున తమ గ్రామ పరిధిలోని భూమిని ఎర్రవల్లి సర్వే నంబర్‌లో కలిపారని వారు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఖస్రా, సేత్వార్ పహాణీ వంటి పాత రెవెన్యూ రికార్డుల ఆధారంగా సర్వేను పక్కాగా నిర్వహించి, తమ భూమిని గుర్తించి వేరు చేయాలని వారు అధికారులను డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు, అధికారులు తమ సర్వే ప్రక్రియను వేగవంతం చేశారు. ఈ భూమిని ప్రస్తుతం సాగు చేస్తున్న రైతులను గుర్తించే పనిలో భాగంగా వారికి నోటీసులు జారీ చేయడం ప్రారంభించారు. మొత్తం 215 మందికి నోటీసులు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకోగా, శనివారం ఒక్కరోజే సుమారు 50 మందికి నోటీసులు అందజేశారు. నిర్దేశిత తేదీల్లో రైతులు తమ భూముల వద్దకు వచ్చి, సంబంధిత వివరాలు అందించాలని ఆ నోటీసుల్లో పేర్కొన్నారు. ఈ నెల 21 నుంచి నాలుగు దశల్లో సర్వేను కొనసాగించనున్నట్లు అధికారులు తెలిపారు. నోటీసుల జారీ ప్రక్రియ పూర్తయ్యాక, క్షేత్రస్థాయిలో ప్రస్తుతం భూమిని సాగు చేస్తున్న, అనుభవంలో ఉన్న రైతులను గుర్తించేందుకు 'ఎంజాయ్‌మెంట్ సర్వే' కూడా నిర్వహిస్తామని స్పష్టం చేశారు. అయితే, వెంకటాపూర్ గ్రామస్థుల వాదనతో ఈ సర్వే ప్రక్రియ మరింత సంక్లిష్టంగా మారింది. రెండు గ్రామాల మధ్య నెలకొన్న ఈ సరిహద్దు వివాదాన్ని అధికారులు ఎలా పరిష్కరిస్తారన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# తిరుమలలో వైభవంగా గరుడ సేవ

**మొదటి పేజీ తరువాయి**

గోపీనాథ్ శిలాతోరణం వద్ద క్యూలైన్లలోని భక్తులకు అందుతున్న అన్నప్రసాదం, నీటి సరఫరాను పరిశీలించారు. సీవీఎస్వో మురళీకృష్ణ, ఎస్పీ సుబ్బరాయుడు భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ సిబ్బందికి తగిన సూచనలిచ్చారు. సుమారు 600 మంది టీటీడీ ఉద్యోగులు తిరుమలలోని 8 కీలక ప్రాంతాల్లో సెక్టోరల్ అధికారులుగా విధులు నిర్వర్తించారు. వైష్ణవ సంప్రదాయంలో గరుడ సేవకు విశిష్ట ప్రాధాన్యం ఉంది. జ్ఞాన, వైరాగ్యాలకు ప్రతీక అయిన గరుత్మంతునిపై ఉన్న స్వామివారిని దర్శించుకుంటే సర్వపాపాలు తొలగిపోతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఈ అద్భుతమైన కార్యక్రమంలో తిరుమల పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, పలువురు టీటీడీ బోర్డు సభ్యులు, జిల్లా కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సినీనటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అర్ధాంగి వసుంధర దేవి కూడా ఈ వేడుకకు హాజరయ్యారు.

# వంటగ్యాస్ సబ్సిడీకి బయోమెట్రిక్ తప్పనిసరి

**మొదటి పేజీ తరువాయి**

అక్రమంగా మళ్లకుండా నిరోధించడమే ఈ నిర్ణయం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశమని ప్రభుత్వం వెల్లడించింది. ఆధార్‌తో బయోమెట్రిక్ అనుసంధానం చేయడం ద్వారా డూప్లికేట్, అనర్హమైన కనెక్షన్లను సులభంగా గుర్తించి తొలగించే అవకాశం ఉంటుందని పేర్కొంది. వినియోగదారులు వివిధ మార్గాల్లో ఈ బయోమెట్రిక్ ప్రక్రియను పూర్తి చేసే సౌలభ్యం ఉంది. సిలిండర్ డెలివరీ చేసే సమయంలో సిబ్బంది వద్ద ఉండే మొబైల్ యాప్ ద్వారా, లేదా నేరుగా సమీపంలోని గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ కార్యాలయాల్లో ఈ ప్రక్రియను పూర్తి చేయవచ్చు. వీటితో పాటు సంబంధిత ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల అధికారిక మొబైల్ యాప్‌ల (ఇండేన్‌కు ఇండియన్‌ఆయిల్ వన్, భారత్‌గ్యాస్‌కు హలోబీపీసీఎల్, హెచ్‌పీ గ్యాస్‌కు హెచ్‌పీ పే) ద్వారా కూడా వినియోగదారులు స్వయంగా ప్రామాణీకరణ చేసుకోవచ్చని ప్రభుత్వం సూచించింది. ఇప్పటికే బయోమెట్రిక్ ప్రక్రియ పూర్తి చేసిన వారు మళ్లీ చేయాల్సిన అవసరం లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. అయితే, నిర్ణీత గడువులోగా ఈ ప్రక్రియ పూర్తి చేయని పక్షంలో సబ్సిడీ వర్తించదు.

# నోటుకే ఓటు!

**మొదటి పేజీ తరువాయి**

చెల్లింపులకు నగదు అడగాల్సి వస్తుందని చెప్తున్నారు. కొత్త నిబంధనల ప్రకారం.. అక్టోబర్ 15 నుంచి వినియోగదారుడి నుంచి వ్యాపారికి (పర్సన్ టు మర్చంట్) చేసే రూ.2,000కు పైబడిన యూపీఐ లావాదేవీలపై 0.4 శాతం ఎండీఆర్ వర్తిస్తుంది. ఈ చార్జీని కస్టమర్ కాకుండా, సదరు వ్యాపారి చెల్లించాల్సి ఉంటుంది. లావాదేవీ విలువ రూ.75,000 లేదా అంతకంటే ఎక్కువ ఉంటే, ఈ చార్జీ గరిష్టంగా రూ.300గా పరిమితం చేశారు. అయితే, వ్యక్తుల మధ్య జరిగే యూపీఐ చెల్లింపులు, అలాగే రూ.2,000 లోపు చేసే వ్యాపార చెల్లింపులపై ఎలాంటి చార్జీలు ఉండవు. ప్రస్తుతం జరుగుతున్న 'పర్సన్ టు మర్చంట్' (పీ2ఎం) లావాదేవీలలో 95 శాతానికి పైగా రూ.2,000 లోపే కాబట్టి, వాటిపై ఈ కొత్త నిబంధన ప్రభావం ఉండదు. అంటే, దుకాణంలో రూ.1,500 వస్తువును యూపీఐ ద్వారా కొంటే ఎలాంటి అదనపు రుసుము ఉండదు. అధిక విలువైన లావాదేవీలకే ఈ మార్పు వర్తిస్తుంది.

### ప్రభుత్వం చెప్తున్నదిదీ..

ఎండీఆర్ భారాన్ని పూర్తిగా వ్యాపారులే భరించాలని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేస్తోంది. ఒకవేళ వ్యాపారులు బిల్లులపై 'యూపీఐ చార్జీ' అని ప్రత్యేకంగా వేయడం ప్రారంభిస్తే, యూపీఐ ఇక ఉచితం కాదనే భావన ప్రజల్లోకి వెళ్తుందని ప్రభుత్వం ఆందోళన చెందుతోంది. ఇది డిజిటల్ చెల్లింపుల స్ఫూర్తిని దెబ్బతీస్తుంది. అందుకే, ఈ భారం వినియోగదారులపై పడకుండా చూసేందుకు పేమెంట్ అగ్రిగేటర్లు, బ్యాంకులతో ప్రభుత్వం చర్చలు జరుపుతోంది. ఈ కొత్త చార్జీల వల్ల ప్రజలు మళ్లీ నగదు వాడకం వైపు మళ్లుతారని ప్రభుత్వం భావించడం లేదు. మొత్తం యూపీఐ లావాదేవీల పరిమాణంలో 4 శాతం మాత్రమే ఈ కొత్త లెవీ పరిధిలోకి వస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ఎన్‌పీసీఐ గణాంకాల ప్రకారం, ఆగస్టులో జరిగిన పీ2ఎం యూపీఐ లావాదేవీల్లో 86 శాతం రూ.500 లోపువే కాగా, మరో 10 శాతం రూ.501 నుంచి రూ.2,000 మధ్య ఉన్నాయి. కాబట్టి సామాన్య ప్రజల రోజువారీ లావాదేవీలపై ఎలాంటి ప్రభావం ఉండదు. మరోవైపు, రూపే డెబిట్ కార్డు చెల్లింపులపై లావాదేవీ విలువతో సంబంధం లేకుండా ఎలాంటి చార్జీలు ఉండవని స్పష్టం చేశారు.

# వరంగల్ ఎయిర్‌పోర్టుకు పేరు చెప్పండి

**మొదటి పేజీ తరువాయి**

కేవలం విమానాశ్రయం మాత్రమే కాదని, పరిశ్రమలు, పర్యాటకం, విద్య, ఉపాధి, పెట్టుబడులకు ఒక నూతన ముఖద్వారమని ఆయన అభివర్ణించారు. అభివృద్ధి చెందుతున్న, అనుసంధానమవుతున్న తెలంగాణకు ఇది నిదర్శనమని పేర్కొన్నారు. కాగా, సీఎం రేవంత్ పిలుపుతో సినీ పరిశ్రమ నుంచి విశేష స్పందన లభించింది. ముఖ్యంగా, వరంగల్ బిడ్డ, ప్రముఖ దర్శకుడు సందీప్ రెడ్డి వంగా ఈ క్రమంలో రెండు పేర్లను ప్రతిపాదించారు. తన సొంత పట్టణంలో అంతర్జాతీయ విమానాశ్రయం ఏర్పాటు కానుండటం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. వరంగల్ చారిత్రక వైభవాన్ని, సాంస్కృతిక

# ఘనంగా 20వ రోజ్‌గార్ మేళా




221 మంది అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేత

హైదరాబాద్, సెప్టెంబర్ 19 (ఈవార్తలు): హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని డాక్టర్ ఎంసీఆర్ మానవ వనరుల అభివృద్ధి సంస్థలో 20వ రోజ్‌గార్ మేళా కార్యక్రమాన్ని కేంద్ర హోం వ్యవహారాల సహాయమంత్రి బండి సంజయ్ కుమార్ ప్రారంభించారు. హైదరాబాద్ జోన్ కేంద్ర పన్నులు, కస్టమ్స్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 221 మంది అభ్యర్థులు నియామక పత్రాలు అందుకున్నారు. ఈ సందర్భంగా బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా 45 ప్రాంతాల్లో నిర్వహించిన 20వ రోజ్‌గార్ మేళాలో మొత్తం 51 వేల నియామక పత్రాలను అందజేసినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ శాఖల్లో 10 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించాలన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సంకల్పానికి ఈ కార్యక్రమం నిదర్శనమన్నారు. ఇప్పటివరకు నిర్వహించిన 19 రోజ్‌గార్ మేళాల్లో దేశవ్యాప్తంగా 12.75 లక్షల నియామక పత్రాలను అందజేసినట్లు పేర్కొన్నారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్ సాధించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంతోపాటు వారికి అవసరమైన మద్దతు అందించేందుకు 'స్టార్టప్ ఇండియా', 'మేక్ ఇన్ ఇండియా'తోపాటు వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన నూతన ఉద్యోగులను బండి సంజయ్ కుమార్ అభినందించారు. ప్రభుత్వ ఉద్యోగం పొందడం అభ్యర్థులతోపాటు వారి కుటుంబాలకు కూడా ఎంతో ముఖ్యమైన ఘట్టమన్నారు. అంకితభావంతో విధులు నిర్వర్తిస్తూ దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమానికి హాజరైన వారికి హైదరాబాద్ జోన్ కేంద్ర పన్నులు, కస్టమ్స్ ప్రధాన కమిషనర్ ఐఆర్ఎస్ అధికారి అరుణ్ కుమార్ స్వాగతం పలికారు. నూతన ఉద్యోగుల రాక ప్రభుత్వ సేవల్లో కొత్త ఆలోచనలు, ఉత్సాహాన్ని తీసుకువస్తుందని అన్నారు. హైదరాబాద్‌లోని జాతీయ కస్టమ్స్, పరోక్ష పన్నులు, మాదకద్రవ్యాల నిరోధక సంస్థలో నూతనంగా నియమితులైన 221 మంది అభ్యర్థులకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. జీఎస్టీ, కస్టమ్స్, సంబంధిత చట్టాలు, కార్యాలయ విధానాలతోపాటు క్షేత్రస్థాయిలో విధుల నిర్వహణపై వారికి శిక్షణ అందిస్తామని చెప్పారు. తెలంగాణ పోలీసు అకాడమీ సహకారంతో ఇన్‌స్పెక్టర్లకు ప్రత్యేక ఆయుధ వినియోగ నైపుణ్య శిక్షణ కూడా ఇస్తామని వెల్లడించారు. నూతన ఉద్యోగులు నిబద్ధత, అంకితభావంతో విధులు నిర్వర్తించాలని, 'పౌరుడు, పన్ను చెల్లింపుదారుడు, దేశం తొలి ప్రాధాన్యత' అనే సూత్రాన్ని పాటించాలని అరుణ్ కుమార్ సూచించారు. క్షేత్రస్థాయిలో వారు నిర్వహించే విధులు ప్రభుత్వ విధానాలను సమర్థంగా అమలు చేయడంతో పాటు 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్ లక్ష్య సాధనకు దోహదపడతాయని తెలిపారు. కార్యక్రమంలో హైదరాబాద్ జీఎస్టీ కమిషనరేట్ ప్రిన్సిపల్ కమిషనర్ ఐఆర్ ఎస్ అధికారి ఎన్.జే. కుమరేష్, ఇతర ఉన్నతాధికారులు, నూతనంగా నియమితులైన అభ్యర్థుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.

## నాలాపై జన్వాడ ఫాంహౌస్: కాంగ్రెస్ ఎంపీలు

శంకర్‌పల్లి, సెప్టెంబర్ 19 (ఈవార్తలు): రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం జన్వాడలోని వివాదాస్పద ఫాంహౌస్‌ను కాంగ్రెస్ పార్టీకి చెందిన పార్లమెంట్ సభ్యులు, శాసనసభ్యుల బృందం ఈరోజు నేరుగా పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బీఆర్ఎస్ కార్యకర్తలు నిరసనకు దిగి కాంగ్రెస్ బృందాన్ని అడ్డుకునేందుకు ప్రయత్నించడంతో పోలీసులు రంగంలోకి దిగి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఈ పరిశీలన అనంతరం మాట్లాడిన నాగర్ కర్నూలు ఎంపీ మల్లు రవి, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి... జన్వాడ ఫాంహౌస్ నిర్మాణానికి ఎలాంటి అనుమతులు లేవని, మురుగునీటి కాలువ (నాలా) పైనే ఈ అక్రమ నిర్మాణాన్ని చేపట్టారని సంచలన ఆరోపణలు చేశారు. ఇంత పెద్ద ఎత్తున నిబంధనలకు విరుద్ధంగా విస్తరించిన ఈ ఫాంహౌస్ భూముల వెనుక పెద్ద ఎత్తున అక్రమాలు దాగి ఉన్నాయని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి విమర్శించారు. కేటీఆర్ స్నేహితుడైన ప్రదీప్ రెడ్డి పేరుతో ఈ భూములు ఉన్నప్పటికీ, అసలు యజమానులెవరనే దానిపై అనేక అనుమానాలు ఉన్నాయన్నారు. గతంలో సత్యం రామలింగరాజుకు చెందిన భూముల్లోనే ఈ ఫాంహౌస్ నిర్మించారని, శతబిష ఆగ్రో ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ పేరుతో ఉన్న ఈ స్థలాల్లో కేటీఆర్ అర్ధాంగి శైలిమతో పాటు ఆయన అత్తగారి పేరిట కూడా భూములు ఉన్నాయని ఆరోపించారు. కేటీఆర్ మున్సిపల్ మంత్రిగా ఉన్న హయాంలో తన అధికార దుర్వినియోగానికి పాల్పడి ఈ అక్రమ నిర్మాణాన్ని ప్రోత్సహించారని, గతంలో ఈ ఫాంహౌస్ దగ్గర డ్రోన్ కెమెరా ఎగురవేసినందుకు రేవంత్ రెడ్డిపై అక్రమ కేసులు బనాయించిన విషయాన్ని ఈ సందర్భంగా కాంగ్రెస్ నేతలు గుర్తుచేశారు.

## లడ్డూపై చంద్రబాబు విషప్రచారం: రోజా

నగరి, సెప్టెంబర్ 19 (ఈవార్తలు): తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో వాడే నెయ్యి కల్తీపై సాగుతున్న ప్రచారాన్ని ఖండిస్తూ వైసీపీ నాయకురాలు, మాజీ మంత్రి రోజా సామాజిక మాధ్యమాల వేదికగా తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. స్వామివారి ప్రసాదాలు అత్యంత పవిత్రమైనవని... కేవలం రాజకీయ లబ్ధి పొందాలనే దురుద్దేశంతో కోట్లమంది భక్తుల నమ్మకాలతో, భావోద్వేగాలతో ఆడుకోవడాన్ని కూటమి నేతలు తక్షణమే కట్టిపెట్టాలని డిమాండ్ చేశారు. శ్రీవారి బ్రహ్మోత్సవాల వేళ నిజమేంటో స్పష్టంగా బయటపడిందని పేర్కొన్న రోజా... జగన్ హయాంలో కల్తీ జరిగిందంటూ వైసీపీపై చేస్తున్న విషప్రచారానికి స్వస్తి పలకాలన్నారు. జగన్ పాలన పచ్చిపాలు లాంటిదని, అక్కడ కల్తీకి ఎంతమాత్రం ఆస్కారం లేదని అన్నారు. నాణ్యతా ప్రమాణాలకు విరుద్ధంగా ఉన్న నెయ్యి ట్యాంకర్లను టీటీడీ బోర్డు తనిఖీల్లోనే తిరస్కరించి వెనక్కి పంపినప్పుడు, ఆ నెయ్యి ప్రసాదాల్లో కలవలేదని స్పష్టమవుతున్నా, జంతువుల కొవ్వు కలిసిందంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు అసత్య ప్రచారం చేయడం భక్తుల మనోభావాలను తీవ్రంగా గాయపరచడమేనని రోజా తన పోస్ట్‌లో నిలదీశారు.

## యూరప్ పర్యటనకు జగన్.. షరతులతో అనుమతి

హైదరాబాద్, సెప్టెంబర్ 19 (ఈవార్తలు): వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ మరోసారి విదేశీ పర్యటనకు సిద్ధమయ్యారు. ఆయన విదేశీ పర్యటనకు హైదరాబాద్ నాంపల్లిలోని సీబీఐ ప్రత్యేక కోర్టు షరతులతో కూడిన అనుమతి మంజూరు చేసింది. కుటుంబ సమేతంగా యూరప్‌లోని తన కుమార్తెల వద్దకు వెళ్లేందుకు అనుమతి కోరుతూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన కోర్టు, 15 రోజుల పర్యటనకు సమ్మతి తెలిపింది. న్యాయస్థానం ఆదేశాల ప్రకారం... అక్టోబర్ 1 నుంచి నవంబర్ 30వ తేదీల మధ్య 15 రోజుల వ్యవధిలో జగన్ యూరప్ పర్యటనను పూర్తి చేసుకోవాల్సి ఉంటుంది. అయితే పర్యటనకు బయల్దేరే ముందు సమగ్ర ప్రయాణ ప్రణాళికను కోర్టుకు, సీబీఐ అధికారులకు సమర్పించాలని న్యాయస్థానం స్పష్టం చేసింది. విదేశీ పర్యటనలో అందుబాటులో ఉండే ఫోన్ నంబర్, ఈ-మెయిల్ ఐడీ వివరాలను దర్యాప్తు సంస్థకు తప్పనిసరిగా అందించాలని కోర్టు కీలక షరతులు విధించింది.

# రేపు పిఠాపురానికి పవన్

### 1,500 కోట్ల అభివృద్ధి పనుల ప్రారంభం



పిఠాపురం, సెప్టెంబర్ 19 (ఈవార్తలు): ఏపీ ఉప ముఖ్యమంత్రి, పిఠాపురం ఎమ్మెల్యే పవన్ కల్యాణ్ తన నియోజకవర్గ అభివృద్ధిపై పూర్తి స్థాయిలో దృష్టి సారించారు. సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పిఠాపురాన్ని దేశంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దే లక్ష్యంతో, సుమారు రూ. 1,500 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నారు. ఇందులో భాగంగా సోమవారం నుంచి రెండు రోజుల పాటు నియోజకవర్గంలో పర్యటించి పలు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో పాల్గొంటారు. పర్యటనలో భాగంగా సోమవారం, రూ. 9.59 కోట్లతో ఆధునికీకరించిన నాగులాపల్లి సమగ్ర రక్షిత తాగునీటి పథకాన్ని పవన్ కల్యాణ్ ప్రజలకు అంకితం చేయనున్నారు. మూడు దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ పథకం ద్వారా చివరి గ్రామాలకు నీరు అందడం లేదన్న సమస్యకు ఈ ఆధునికీకరణతో పరిష్కారం లభించనుంది. దీని ద్వారా 52 ఆవాసాల్లోని సుమారు 97 వేల మందికి తాగునీటి కష్టాలు తీరనున్నాయి. దీంతో పాటు, పిఠాపురం పట్టణంలో ఆహ్లాదకర వాతావరణం కోసం ఏర్పాటు చేసిన 'పీఠికాపుర వనం', చందుర్తి-తాటిపర్తి బీటీ రోడ్డును కూడా ఆయన ప్రారంభించనున్నారు. మంగళవారం నిర్వహించే బహిరంగ సభలో నియోజకవర్గ రూపురేఖలు మార్చే కీలక ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయనున్నారు. పిఠాపురం ప్రజల చిరకాల వాంఛ అయిన రూ. 200 కోట్ల అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ, రూ. 80 కోట్లతో గొల్లప్రోలు వాటర్ వర్క్స్, రూ. 118 కోట్లతో రోడ్ ఓవర్ బ్రిడ్జి, రూ. 323 కోట్లతో ఉప్పాడ తీర ప్రాంత రక్షణ గోడ వంటి భారీ పనులకు ఆయన శ్రీకారం చుడతారు. వీటితో పాటు జల్ జీవన్ మిషన్, అమృత్ 2.0 పథకాల కింద పలు తాగునీటి ప్రాజెక్టులకు కూడా పచ్చజెండా ఊపనున్నారు. ఈ అభివృద్ధి పనులతో పాటు సంక్షేమ కార్యక్రమాలకు కూడా పవన్ ప్రాధాన్యత ఇస్తున్నారు. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం స్వయం సహాయక సంఘాలకు రూ. 120 కోట్ల రుణాలను అందజేయనున్నారు. ఉప్పాడ తీరప్రాంత మత్స్యకారులకు ఆధునిక లైఫ్ జాకెట్లు, డ్రై ఫిష్ యూనిట్లు, ఐస్ బాక్సులతో కూడిన మోటార్ సైకిళ్లను పంపిణీ చేసి వారి జీవనోపాధికి భరోసా కల్పించనున్నారు. అదేవిధంగా, 89 మంది లబ్ధిదారులకు క్రమబద్ధీకరణ పట్టాలు అందించి వారి భూములపై హక్కులు కల్పించనున్నారు. ఈ రెండు రోజుల పర్యటన ద్వారా నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి పవన్ కల్యాణ్ పటిష్టమైన పునాదులు వేస్తున్నారని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

## డబ్ల్యూఏపీఎల్ ప్రారంభం

### మన అమ్మాయిలు టీమిండియాలో ఆడాలి
### ఏపీ మంత్రి నారా లోకేశ్



మంగళగిరి, సెప్టెంబర్ 19 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ మహిళా క్రికెటర్లు జాతీయ జట్టులో స్థానం సంపాదించాలన్నదే తన ఆకాంక్ష అని రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. రాష్ట్రంలోని మహిళా క్రికెటర్ల కలలను సాకారం చేసేందుకు తొలిసారిగా నిర్వహిస్తున్న మహిళల ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూఏపీఎల్) ఒక బలమైన వేదిక అవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. శనివారం సాయంత్రం మంగళగిరిలో డబ్ల్యూఏపీఎల్ ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టోర్నమెంట్ ట్రోఫీని నారా బ్రహ్మణి, భారత మహిళా క్రికెట్ దిగ్గజం, టోర్నీ బ్రాండ్ అంబాసిడర్ మిథాలీరాజ్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ టోర్నీ ప్రారంభంపై మంత్రి నారా లోకేశ్ సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ తన సంతోషాన్ని పంచుకున్నారు. "మంగళగిరిలో తొలి మహిళల ఆంధ్ర ప్రీమియర్ లీగ్ ప్రారంభం కావడం చాలా ఆనందంగా ఉంది. యువ మహిళా క్రికెటర్లు తమ ప్రతిభను ప్రదర్శించడానికి, ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి డబ్ల్యూఏపీఎల్ బలమైన పునాది వేస్తుంది" అని ఆయన పేర్కొన్నారు. ఈ టోర్నీకి బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్న మిథాలీరాజ్‌కు ఆయన ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలోని క్రీడాకారిణులకు డబ్ల్యూపీఎల్, ఆ తర్వాత టీమిండియాకు ఆడే మార్గాన్ని సుగమం చేస్తున్న ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్‌ను లోకేశ్ అభినందించారు. టోర్నీలో పాల్గొంటున్న నాలుగు జట్లకు, ప్రతి క్రీడాకారిణికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ టోర్నమెంట్ ద్వారా ఆంధ్రప్రదేశ్ నుంచి భవిష్యత్ ఛాంపియన్లు ఆవిర్భవించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు లోకేశ్ తన పోస్టులో పేర్కొన్నారు.

## కరవులో రైతాంగం.. దోపిడీలో కూటమి : పేర్ని నాని

తాడేపల్లి, సెప్టెంబర్ 19 (ఈవార్తలు): అధికార పీఠం ఎక్కేందుకు ఊహాజనిత హామీలతో ప్రజలను నమ్మించి, అధికారంలోకి వచ్చాక ఆ హామీలను పూర్తిగా పక్కనబెట్టేసిందని కూటమి ప్రభుత్వంపై మాజీ మంత్రి, వైసీపీ సీనియర్ నాయకుడు పేర్ని నాని తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా సాగునీరు అందక, సరైన ప్రణాళికలు లేక కరవు కోరల్లో చిక్కుకుని రైతాంగం అల్లాడిపోతుంటే... కూటమి నాయకులు మాత్రం పాలనను గాలికి వదిలేసి రాష్ట్రాన్ని దోచుకోవడంలో నిమగ్నమయ్యారని ధ్వజమెత్తారు. గతంలో జగన్ అందించిన పారదర్శక సంక్షేమ పథకాల కంటే మిన్నగా పథకాలు ఇస్తామంటూ ఇచ్చిన 'సూపర్ సిక్స్' హామీలు ఇప్పుడు ప్రకటనలకే పరిమితమయ్యాయని విమర్శించారు. ప్రభుత్వ అశాస్త్రీయ విధానాలు, మోసపూరిత వైఖరిపై నియోజకవర్గాల వారీగా ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మొదలైందని, ఇప్పటికే పలు ప్రాంతాల్లో బాధితులు రోడ్లపైకి వచ్చి నిరసనలు తెలుపుతున్నారని గుర్తుచేశారు. ఈ ప్రజాగ్రహం నుంచి తప్పించుకునేందుకే కూటమి నాయకత్వం ప్రతిరోజూ కొత్త నాటకాలకు తెరలేపుతోందని, ఇచ్చిన మాట నిలబెట్టుకోకపోతే రాబోయే రోజుల్లో ప్రజల నుంచి కూటమి ప్రభుత్వానికి తగిన గుణపాఠం తప్పదని పేర్ని నాని హెచ్చరించారు.



## వైఎస్, కేసీఆర్ ఫిరాయింపులను ప్రోత్సహించారు: కిషన్ రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 19 (ఈవార్తలు): ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపులపై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పు అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీలకు చెంపపెట్టు అని కేంద్ర మంత్రికిషన్ రెడ్డి అన్నారు. శనివారం హైదరాబాదులో మీడియాతో మాట్లాడిన ఆయన... ఉమ్మడి ఏపీలో వైఎస్ రాజశేఖరరెడ్డి, తెలంగాణలో కేసీఆర్ ప్రజాస్వామ్య సూత్రాలను పక్కనబెట్టి ఫిరాయింపులను విపరీతంగా ప్రోత్సహించారని ఆరోపించారు. గతంలో సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్‌లకు ఎమ్మెల్యే పదవులకు రాజీనామా చేయకుండానే మంత్రి పదవులు కట్టబెట్టారని మండిపడ్డారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉంటూనే దానం నాగేందర్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేశారని, బీజేపీ శ్రేణులు జరిపిన నిరంతర న్యాయపోరాటం వల్లే ఆయనపై అనర్హత వేటు ముప్పు వచ్చిందని స్పష్టం చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు రెండూ భూదందాలు, అవినీతిలోనే పోటీపడుతున్నాయని... 'దోచుకోవడం-దాచుకోవడం' తప్ప ప్రజాక్షేమం పట్టడం లేదని కిషన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ పాలనపై అనేక అవినీతి ఆరోపణలు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇప్పటివరకు వారిపై ఏలాంటి కఠిన చర్యలు తీసుకోకుండా 'మ్యాచ్ ఫిక్సింగ్' రాజకీయాలు నడుపుతున్నారని విమర్శించారు. ఇచ్చిన హామీలు, ఆరు గ్యారంటీలు నెరవేర్చలేక ప్రజల దృష్టిని మళ్లించడానికే ఇరు పార్టీలు పరస్పరం నాటకాలు ఆడుతున్నాయని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేకు కాంగ్రెస్ ఎంపీ టికెట్ ఏ ప్రాతిపదికన ఇచ్చారో రాహుల్ గాంధీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాబోయే ఏ ఎన్నికలకైనా బీజేపీ సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉందని వెల్లడించారు.



## బండి సంజయ్ మానవత్వం

### కాన్వాయ్ ఆపి ప్రమాద బాధితులకు సాయం
### డివైడర్‌ను ఢీకొని కారు బోల్తా.. బాలికకు గాయాలు
### తన భద్రతా వాహనంలో ఆసుపత్రికి తరలింపు

సిద్దిపేట, సెప్టెంబర్ 19 (ఈవార్తలు): కేంద్ర సహాయ మంత్రి, బీజేపీ సీనియర్ నేత బండి సంజయ్ మానవత్వాన్ని చాటుకున్నారు. మార్గమధ్యంలో జరిగిన ఒక రోడ్డు ప్రమాదాన్ని గమనించిన ఆయన, వెంటనే తన కాన్వాయ్‌ను నిలిపివేసి సహాయక చర్యల్లో పాల్గొన్నారు. ప్రమాదానికి గురైన బాధితులను తన భద్రతా వాహనంలోనే ఆసుపత్రికి తరలించి అండగా నిలిచారు. శనివారం సిద్దిపేట నుంచి గజ్వేల్ వైపు వెళుతున్న ఒక కారు రాజీవ్ రహదారిపై అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. ఈ ప్రమాదం సమయంలో ఎయిర్ బ్యాగులు తెరుచుకోవడంతో కారు నడుపుతున్న వ్యక్తి, ముందు సీటులో ఉన్న ఆయన భార్య స్వల్ప గాయాలతో బయటపడ్డారు. అయితే, వెనుక సీటులో కూర్చున్న వారి కుమార్తెకు తల, ముక్కు భాగాల్లో తీవ్ర గాయాలయ్యాయి. అదే సమయంలో సిరిసిల్ల వైపు వెళుతున్న బండి సంజయ్ ఈ ప్రమాదాన్ని గమనించారు. వెంటనే తన వాహనాన్ని ఆపి, భద్రతా సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. కారులో చిక్కుకున్న బాధితులను బయటకు తీయడంలో స్వయంగా సహాయపడ్డారు. తీవ్రంగా గాయపడిన బాలికను, ఆమె తల్లిదండ్రులను వెంటనే తన కాన్వాయ్‌లోని భద్రతా వాహనంలో ఆసుపత్రికి తరలించారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులకు సూచించారు. ఆపదలో ఉన్నవారిని సకాలంలో ఆదుకున్న బండి సంజయ్ చొరవను పలువురు అభినందించారు.

## బొత్స కూతురికి వైసీపీ కీలక పదవి

వైజాగ్, సెప్టెంబర్ 19 (ఈవార్తలు): ఉత్తరాంధ్ర రాజకీయాల్లో మరో సంచలనం నమోదైంది. వైసీపీ సీనియర్ నేత, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ కుమార్తె బొత్స అనూష ప్రత్యక్ష, క్రియాశీల రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. వైసీపీ అధినేత జగన్ ఆదేశాల మేరకు భీమిలి నియోజకవర్గ సమన్వయకర్తగా అనూషను నియమిస్తూ పార్టీ నిర్ణయం తీసుకుంది. భీమిలి పరిధిలో క్షేత్రస్థాయి నాయకులను, విస్తృత కేడర్‌ను సమాయత్తం చేస్తూ పార్టీని బలోపేతం చేసే కీలక బాధ్యతను ఆమెకు అప్పగించారు. గతంలో ధీరా ఫౌండేషన్, సత్య ఎడ్యుకేషన్ సొసైటీలకు డైరెక్టర్‌గా వ్యవహరిస్తూ పలు ఉచిత వైద్య, సామాజిక కార్యక్రమాల ద్వారా గుర్తింపు పొందిన అనూష, తండ్రి బాటలోనే నడుస్తూ ప్రజలకు సేవ చేయడానికి సిద్ధమయ్యారు. ఇప్పుడు అధికారికంగా భీమిలి సమన్వయకర్తగా నియామకం కావడంతో ఉత్తరాంధ్రలో వైసీపీ తరఫున కొత్త తరం నాయకత్వం రూపుదిద్దుకుంటోందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

# శంషాబాద్‌లో రోడ్డు ప్రమాదం.. నలుగురి మృతి

శంషాబాద్, సెప్టెంబర్ 19 (ఈవార్తలు): రంగారెడ్డి జిల్లా శంషాబాద్ సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు దుర్మరణం చెందారు. వేగంగా వెళ్తున్న ఇన్నోవా కారు ప్రమాదానికి గురవడంతో ఈ విషాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో కారు డ్రైవర్ తీవ్రంగా గాయపడగా, అతడిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట్ మండలం మెట్టుగడ్డ తండాకు చెందిన ఒక కుటుంబం వినాయక నిమజ్జన వేడుకలు ముగించుకుని ఇన్నోవా కారులో శంషాబాద్ వైపు బయలుదేరింది. జాతీయ రహదారిపై పాలమాకుల గ్రామ సమీపంలోకి రాగానే వీరి వాహనం కల్వర్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కేతావత్ లింబ్యా (54), ఆయన భార్య కేతావత్ జమున (45), కాట్రావత్ మాన్‌సింగ్ (48), కేతావత్ వశ్రామ్ (45) అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో లింబ్యా, మాన్‌సింగ్, వశ్రామ్ వ్యాపారులు కాగా, జమున గృహిణి.



కారు డ్రైవర్ సబావత్ అశోక్‌కు తీవ్ర గాయాలు కావడంతో అతడిని శంషాబాద్‌లోని ట్రైడెంట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం అతని పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీస్తున్నారు.



## 200 మంది ఉపాధ్యాయులకు సత్కారం

కూకట్‌పల్లి, సెప్టెంబర్ 19 (ఈవార్తలు): ఉపాధ్యాయుల సేవలు, అంకితభావాన్ని గౌరవిస్తూ మిత్రా టీమ్, కూకట్‌పల్లి ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 50 పాఠశాలలకు చెందిన 200 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కార్యక్రమానికి ఏపోపీఏ రాష్ట్ర అధ్యక్షుడు మల్లిపెద్ది శంకర్ ముఖ్య అతిథిగా హాజరై ఉపాధ్యాయులను ఉద్దేశించి ప్రసంగించారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని, సమాజ నిర్మాణంలో వారి సేవలు అమూల్యమైనవని పేర్కొన్నారు. జేఎన్‌టీయూ ప్రొఫెసర్ కుమారస్వామి గుప్తా, బీజేపీ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షురాలు శ్రావంతి విశిష్ట అతిథులుగా హాజరై ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు ఉపాధ్యాయులను ఉద్దేశించి స్ఫూర్తిదాయక సందేశాలను అందించారు. పాఠశాలల చైర్మన్లకు 'గురు శ్రేష్ఠ అవార్డు', ఉపాధ్యాయులకు 'గురు రత్న అవార్డు' అందజేసి ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయుల సేవలు, అంకితభావాన్ని గుర్తిస్తూ నిర్వహించిన ఈ సత్కార కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. 'కలిసి.. ఉజ్వల భవిష్యత్తు కోసం' అనే నినాదంతో మిత్రా టీమ్ నిర్వహించిన ఈ కార్యక్రమం ఉపాధ్యాయుల్లో ఉత్సాహాన్ని నింపింది. కార్యక్రమం విజయవంతం కావడంలో మిత్రా టీమ్‌కు చెందిన పాఠశాలల చైర్మన్లు రవీందర్‌రావు, అశోక్, నరేందర్, మల్లేష్, శ్రీశైలం, ఇంద్రసేనారెడ్డి, వెంకట్‌స్వామి, నాగరాజు, రమణ, విష్ణువర్ధన్ కీలక పాత్ర పోషించారు. వారి సమన్వయం, సహకారంతో కార్యక్రమం విజయవంతమైంది. కార్యక్రమానికి హాజరైన ఉపాధ్యాయులు, పాఠశాలల యాజమాన్యాలు మిత్రా టీమ్‌ను అభినందించారు.



## సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట: సంజయ్

జగిత్యాల రూరల్, సెప్టెంబర్ 19 (ఈవార్తలు): తెలంగాణలో మహిళా సాధికారతే లక్ష్యంగా ప్రభుత్వం సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్‌కుమార్ అన్నారు. జగిత్యాల రూరల్ మండలం వంజరిపల్లి గ్రామంలో రూ.10 లక్షల నిధులతో నిర్మించనున్న శ్రీ లక్ష్మీపార్వతి మహిళా సమాఖ్య భవనానికి శనివారం శంకుస్థాపన చేశారు. అనంతరం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళల సంక్షేమం, సాధికారతకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందన్నారు. గ్రామాల అభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయిస్తూ మౌలిక వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. అనంతరం ఇటీవల గుండె ఆపరేషన్ చేయించుకున్న ఉప సర్పంచ్ తిరుపతిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు గాజంగి నందయ్య, సర్పంచ్ గంగమల్లయ్య, మాజీ ఏఎంసీ చైర్మన్ దామోదర్‌రావు, నక్కల రవీందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ బాల ముకుందం, ఎంఆర్వో హకీమ్, ఎస్సై ఉమాసాగర్, ఎంపీవో రవిబాబు, ఏఈ విజయ్ తదితరులు పాల్గొన్నారు.



## వినాయక మండపాల వద్ద బాంబ్ స్క్వాడ్స్ తనిఖీలు

గంగాధర, సెప్టెంబర్ 19 (ఈవార్తలు): వినాయక నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో గంగాధర మండలంలోని వివిధ వినాయక మండపాలను పోలీసులు శనివారం తనిఖీ చేశారు. ఎస్ఐ బి. వంశీకృష్ణ ఆధ్వర్యంలో బాంబ్ డిస్పోజల్ టీమ్‌తో కలిసి మండపాలను సందర్శించి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మండపాల నిర్వాహకులకు భద్రతా చర్యలు, అనుమానాస్పద వస్తువుల పట్ల అప్రమత్తంగా ఉండటం, అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ప్రజలు, మండపాల నిర్వాహకులు పోలీసులకు సహకరించి వినాయక నవరాత్రి ఉత్సవాలను శాంతియుతంగా, సురక్షితంగా నిర్వహించాలని ఎస్ఐ సూచించారు.



## గణేశుడి ముందు జానపద ఆటపాటలు

ధర్మపురి, సెప్టెంబర్ 19 (ఈవార్తలు): ధర్మపురి పట్టణంలోని కాశెట్టి వాడ గణేష్ మండలి ఆధ్వర్యంలో తెలంగాణ జానపద ఆటపాటల సాంస్కృతిక కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. గణేష్ ఉత్సవాల్లో భాగంగా జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు, కళాకారులు జానపద ఆటపాటలతో ఆకట్టుకున్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ వేముల నాగలక్ష్మి మాట్లాడుతూ.. 48 ఏళ్లుగా గణేష్ ఉత్సవాలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు దోహదపడతాయన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించి మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, గణేష్ మండలి సభ్యులు, విద్యార్థులు, స్థానికులు పాల్గొన్నారు.

# రేవంత్‌వి డైవర్షన్ పాలిటిక్స్: జీవన్ రెడ్డి

జగిత్యాల, సెప్టెంబర్ 19 (ఈవార్తలు): పాలన చేతకాక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.జీవన్‌రెడ్డి ఆరోపించారు. హైకోర్టు తీర్పు రేవంత్‌రెడ్డికి చెంపపెట్టు లాంటిదని వ్యాఖ్యానించారు. పార్టీ ఫిరాయింపులకు సూత్రధారి రేవంత్‌రెడ్డేనని, ముఖ్యమంత్రిగా కొనసాగేందుకు ఆయనకు నైతిక హక్కు లేదని అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్‌తో కలిసి శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎల్‌నినో ప్రభావంతో కరువు పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో రైతులకు నీరందించడంపై ప్రభుత్వం దృష్టి సారించకుండా ఇతర అంశాలను తెరపైకి తెస్తోందని విమర్శించారు. అన్నారం, సుందిళ్ల పంప్‌హౌస్‌లను ఉపయోగించుకోవచ్చని ఎన్డీఎస్ఏ పేర్కొందని తెలిపారు. కన్నెపల్లి పంప్‌హౌస్ ద్వారా నీటిని అందించాలని డిమాండ్ చేశారు. ఒక పార్టీ బీ-ఫారంపై గెలిచి మరో పార్టీ తరఫున పోటీ చేసిన దానం నాగేందర్‌పై చర్యల అంశాన్ని పక్కదారి పట్టించేందుకే కేసీఆర్ భూములపై ఆరోపణలు చేస్తున్నారని జీవన్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో విద్యుత్ ఉత్పత్తి పెంచి వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ అందించామని, ప్రస్తుతం రైతులకు ఎందుకు అదే విధంగా విద్యుత్ ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఆరు గ్యారంటీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. దావ వసంత సురేష్ మాట్లాడుతూ ఆరు గ్యారంటీల అమలులో వైఫల్యం చెందిన ప్రభుత్వం కేసీఆర్‌పై బురదజల్లే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. కేసీఆర్ భూముల విషయంలో అసెంబ్లీలో చెప్పిన వివరాలకు, చేస్తున్న ఆరోపణలకు తేడా ఉందన్నారు.



ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేని పక్షంలో రేవంత్‌రెడ్డి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రైతులను కరువు పరిస్థితుల నుంచి కాపాడేందుకు కన్నెపల్లి నుంచి నీటిని తరలించి, అవసరమైన విద్యుత్‌ను అందించాలని జీవన్‌రెడ్డి డిమాండ్ చేశారు.

# ఆరుతడి పంటలే మేలు



చందుర్తి, సెప్టెంబరు 19 (ఈవార్తలు): వ్యవసాయంలో నూతన విధానాలను అవలంబించినప్పుడే రైతులకు సాగు లాభసాటిగా మారుతుందని, సంప్రదాయ వరి సాగుకు బదులుగా ఆరుతడి పంటల వైపు రైతులు మొగ్గు చూపాలని రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ డివిజన్ ఆత్మ కమిటీ చైర్మన్ ముస్కు ముకుందరెడ్డి సూచించారు. శనివారం చందుర్తి మండలం సనుగుల గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 'ఆత్మ' పథకం ద్వారా ఆర్‌పీఎల్ (రికగ్నిషన్ ఆఫ్ ప్రియర్ లెర్నింగ్) శిక్షణ, రైతు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముస్కు ముకుందరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా ఒకే రకమైన పంటలు సాగు చేయడం వల్ల నేలలో భూసారం తగ్గి దిగుబడులు తగ్గే అవకాశం ఉందన్నారు. అందువల్ల రైతులు క్రమం తప్పకుండా పంట మార్పిడి విధానాన్ని పాటించాలని సూచించారు. వాతావరణ మార్పుల కారణంగా వర్షపాతం తగ్గే పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని తక్కువ నీటితో సాగు చేయగల ఆరుతడి పంటలను ఎంచుకోవాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో కోతుల బెడదకు ప్రత్యామ్నాయంగా ఆయిల్‌పామ్ సాగును చేపట్టాలని సూచించారు. ఆయిల్‌పామ్ సాగుతో కోతుల వల్ల పంట నష్టం తగ్గడమే కాకుండా దీర్ఘకాలంలో రైతులకు స్థిరమైన ఆదాయం లభించే అవకాశం ఉందన్నారు. వ్యవసాయం ప్రారంభించే ముందు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. భూమి స్వభావం, అందులోని పోషకాలకు అనుగుణంగా ఎరువులు వినియోగించి పంటలు సాగు చేస్తే పెట్టుబడి వ్యయం తగ్గి దిగుబడులు, ఆదాయం పెరిగే అవకాశం ఉంటుందని వివరించారు. మండలవ్యాప్తంగా త్వరలో ఉచితంగా భూసార పరీక్షలు నిర్వహించి, ఏ నేలలో ఏ పంటలు సాగు చేయాలనే దానిపై వ్యవసాయ అధికారులు రైతులకు సూచనలు అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో రుద్రంగి మార్కెట్ కమిటీ చైర్మన్ చెలకల తిరుపతి, వ్యవసాయ అధికారులు, ఆత్మ కమిటీ ప్రతినిధులు, గ్రామ ప్రజాప్రతినిధులు, నాయకులు, సనుగుల, పరిసర ప్రాంతాల రైతులు పాల్గొన్నారు.

## కాపర్ వైర్ దొంగ అరెస్టు



మల్యాల, సెప్టెంబర్ 19 (ఈవార్తలు): ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్ వైర్ల దొంగతనాలకు పాల్పడిన కేసులో పరారీలో ఉన్న ప్రధాన నిందితుడు తపాలా బాబు (42)ను మల్యాల పోలీసులు శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మల్యాల శివారులోని బైపాస్ మార్గంలో నిందితుడు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నట్లు సమాచారం అందడంతో ఎస్ఐ ఎస్. సందీప్ సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకుని అతడిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో ప్రత్యేక పరికరాలతో ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి, అందులోని కాపర్ వైర్లను అపహరించి ఆటోలో తరలించినట్లు నిందితుడు వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం వైర్లను ముద్దలుగా చేసి విక్రయించినట్లు పేర్కొన్నారు. దొంగిలించిన కాపర్ వైర్లను విక్రయించగా వచ్చిన డబ్బును కోట శ్రీను, పల్లెపు సురేశ్, సూర సురేశ్‌లతో కలిసి పంచుకునేవాడినని విచారణలో వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు. ఈ ముగ్గురిని ఇప్పటికే ఈ నెల 17న అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. నిందితుడి నుంచి అపాచీ ద్విచక్ర వాహనం, ఒక సెల్‌ఫోన్, 15 కిలోల కాపర్ వైర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. అనంతరం తపాలా బాబును కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.



## 'సర్' విజయవంతానికి సహకరించాలి

వేములవాడ అర్బన్, సెప్టెంబర్ 19 (ఈవార్తలు): ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్/'సర్) ప్రక్రియ విజయవంతం కావడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని వేములవాడ ఆర్డీఓ కె.ఎస్.బి. కుమారి కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. శనివారం సాయంత్రం ఆర్డీఓ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల అఖిలపక్ష నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించిన 'సర్' షెడ్యూల్‌ను ఓటర్లు పరిశీలించి, నిర్దేశిత గడువులోగా అవసరమైన ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సూచించారు. వేములవాడ నియోజకవర్గంలోని 262 పోలింగ్ కేంద్రాల పరిధిలో ప్రభుత్వపరంగా బీఎల్‌వోలు, వివిధ రాజకీయ పార్టీల తరఫున బీఎల్ఏలు పనిచేస్తున్నారని తెలిపారు. ఓటర్లకు ఏవైనా సందేహాలు లేదా సమాచారం అవసరమైతే సంబంధిత పోలింగ్ కేంద్రం బీఎల్‌వో, బీఎల్ఏలను సంప్రదించాలని సూచించారు. ఓటరు జాబితాలో చేర్పులు, మార్పులు, సవరణలు, తొలగింపులు, కొత్త ఓటరు నమోదు కోసం ఫారం-6, ఫారం-7, ఫారం-8లను ఉపయోగించుకోవాలని తెలిపారు. కొత్త ఓటరు నమోదు, ఓటరు వివరాల సవరణలకు అక్టోబర్ 7 చివరి తేదీ అని, తుది ఓటరు జాబితాను నవంబర్ 9న ప్రచురించనున్నట్లు ఆర్డీఓ వెల్లడించారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకుడు వి. నిత్యానందరావు, బీఆర్ఎస్ నాయకుడు పొలాస నరేందర్, టీడీపీ నాయకుడు చింతలకోటి రామస్వామిగౌడ్, ఎన్నికల విభాగం సీనియర్ అసిస్టెంట్ శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

## అమిత్ షాకు అస్వస్థత

హుబ్బళ్లి: కర్ణాటక పర్యటనలో ఉన్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా శనివారం అస్వస్థతకు గురయ్యారు. దీంతో హుబ్బళ్లిలో ముందుగా నిర్ణయించిన కార్యక్రమానికి ఆయన హాజరు కాలేకపోయారు. వైద్యులు విశ్రాంతి తీసుకోవాలని సూచించడంతో ఆయన హోటల్‌కే పరిమితమయ్యారు. హుబ్బళ్లిలోని కేఎల్ఈ జగద్గురు గంగాధర్ మహాస్వామిగళు మూరుసవిర్మఠ్ మెడికల్ కాలేజీ నూతన భవనాన్ని, 1,200 పడకల కేఎల్ఈ హాస్పిటల్ అండ్ మెడికల్ రీసెర్చ్ సెంటర్‌ను అమిత్ షా ప్రారంభించాల్సి ఉంది. రూ.700 కోట్ల వ్యయంతో ఈ మెడికల్ కాలేజీ భవనాన్ని నిర్మించారు. ఈ కార్యక్రమం నిమిత్తం షెడ్యూల్ ప్రకారమే శుక్రవారం రాత్రి ఆయన హుబ్బళ్లి చేరుకుని ఒక హోటల్‌లో బస చేశారు.

## హైదరాబాద్‌లో వేములవాడ యువకుడి సూసైడ్

వేములవాడ అర్బన్, సెప్టెంబర్ 19 (ఈవార్తలు): హైదరాబాద్‌లోని బహదూర్‌పల్లిలో బీటెక్ విద్యార్థి బలవన్మరణానికి పాల్పడిన ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ అర్బన్ మండలం అగ్రహారం గ్రామానికి చెందిన సాయిచరణ్ (20) బహదూర్‌పల్లిలోని వారాహి బాలుర హాస్టల్‌లో స్నేహితులతో కలిసి ఉంటూ ఎంఎల్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. గురువారం రాత్రి 8 గంటల సమయంలో స్నేహితులు సినిమాకు వెళ్లగా సాయిచరణ్ హాస్టల్ గదిలో ఒంటరిగా ఉన్నాడు. అర్ధరాత్రి స్నేహితులు తిరిగి వచ్చి గది తలుపు తట్టినా తెరవకపోవడంతో సాయిచరణ్ నిద్రపోతున్నాడని భావించి మరో గదిలో నిద్రించారు. శుక్రవారం ఉదయం 8 గంటల సమయంలో మరోసారి తలుపు తట్టినా స్పందన లేకపోవడంతో తలుపు పగులగొట్టి చూడగా సాయిచరణ్ గదిలో ఉరేసుకుని కనిపించాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో పాటు కుటుంబ సభ్యులకు విషయం తెలిపారు. మృతుడి తండ్రి శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సాయిచరణ్ బలవన్మరణానికి గల కారణాలు తెలియరాలేదని పోలీసులు తెలిపారు.

## ప్రకృతి వ్యవసాయంపై రైతులకు శిక్షణ



మల్యాల, సెప్టెంబర్ 19 (ఈవార్తలు): మల్యాల మండలం నూకపల్లి రైతువేదికలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయం, సేంద్రియ ఎరువుల వినియోగంపై రైతులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రామన్నపేట సర్పంచ్ వి. మౌర్య, నూకపల్లి సొసైటీ చైర్మన్ ఎన్. సతీష్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మండల వ్యవసాయ అధికారి కే. చంద్రదీపక్ ప్రకృతి వ్యవసాయంలో ఉపయోగించే బీజామృతం, ఘనజీవామృతం, జీవామృతం, బ్రహ్మాస్త్రం, నీమాస్త్రం, దశపర్ణి కషాయం, బయోచార్, వేపనూనె తదితరాల తయారీ విధానం, వినియోగం, ప్రయోజనాలను రైతులకు వివరించారు. సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తుల ధ్రువీకరణ అధికారులు జి. కుమార్, శ్రీకాంత్ ప్రకృతి వ్యవసాయం వల్ల కలిగే ప్రయోజనాలు, పాటించాల్సిన జాగ్రత్తలు, ధ్రువీకరణకు అవసరమైన సూచనలను వివరించారు. అనంతరం క్షేత్ర సందర్శనలో భాగంగా మిరప, పసుపు తోటలను పరిశీలించి పంటల సాగుపై రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఈఓలు ఈ. శ్రీనివాస్, కే. శ్రీనివాస్‌తో పాటు రైతులు వి. లక్ష్మారెడ్డి, మంద మల్లేశంగౌడ్, స్వామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## కోర్టులు-పోలీసుల సమన్వయం కీలకం: జడ్జి రత్న పద్మావతి

జగిత్యాల, సెప్టెంబర్ 19 (ఈవార్తలు): ప్రజలకు న్యాయవ్యవస్థను మరింత సులభంగా, వేగంగా, పారదర్శకంగా అందించాలంటే కోర్టులు, పోలీస్ శాఖల మధ్య సమన్వయం ఎంతో కీలకమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి రత్న పద్మావతి అన్నారు. జిల్లా కోర్టు ప్రాంగణంలో శనివారం జిల్లా కోర్టు కోఆర్డినేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల నిర్వహించిన జాతీయ మెగా లోక్ అదాలత్‌ను విజయవంతం చేసేందుకు కృషి చేసిన న్యాయశాఖ, పోలీస్ అధికారులు, సిబ్బంది, బార్ అసోసియేషన్ సభ్యులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. జిల్లాలో పెండింగ్ క్రిమినల్ కేసులు, దర్యాప్తు నాణ్యత, చార్జ్‌షీట్ల దాఖలు, సమన్లు, ఎన్‌బీడబ్ల్యూల అమలు, సాక్షుల హాజరు, ఫోరెన్సిక్ నివేదికలపై సమావేశంలో చర్చించారు.కేసుల విచారణలో జాప్యం లేకుండా పోలీస్, ప్రాసిక్యూషన్ విభాగాలు సమన్వయంతో పనిచేయాలని న్యాయమూర్తి సూచించారు. లోక్ అదాలత్‌పై కక్షిదారులకు అవగాహన కల్పించడం ద్వారా జిల్లాలో 2,561 కేసులు పరిష్కారమయ్యాయని తెలిపారు. కేసుల పరిష్కారంలో సేవలందించిన న్యాయమూర్తులు, పోలీస్ అధికారులు, సిబ్బంది, బార్ అసోసియేషన్ సభ్యులను అభినందించారు.



## నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు

జగిత్యాల, సెప్టెంబర్ 19 (ఈవార్తలు): వినాయక నవరాత్రుల ముగింపు సందర్భంగా నిర్వహించనున్న వినాయక నిమజ్జన కార్యక్రమానికి చింతచెరువు వద్ద చేపడుతున్న ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్పీ అశోక్‌కుమార్‌తో కలిసి మున్సిపల్ చైర్‌పర్సన్ సమీండ్ల వాణి శ్రీనివాస్ శనివారం పరిశీలించారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో చేపడుతున్న పారిశుద్ధ్య పనులు, విద్యుత్, తాగునీరు, నిమజ్జన ప్రదేశంలోని మౌలిక వసతులు, భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలను అధికారులు పరిశీలించారు. నిమజ్జన కార్యక్రమంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశించారు. కార్యక్రమంలో డీఎస్పీ పురుషోత్తంరెడ్డి, మున్సిపల్ కమిషనర్ సత్యప్రణవ్, కౌన్సిలర్లు బొల్లారపు స్వప్న గిరిధర్, బదుగు పద్మ రాజేందర్, జుంబర్తి గంగాలక్ష్మి రాజ్‌కుమార్, సీఐ కరుణాకర్, ఫైర్, విద్యుత్, మత్స్య, ఆర్అండ్‌బీ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## జగిత్యాల మున్సిపల్ కార్యాలయంలో ఉత్తర పూజలు

జగిత్యాల, సెప్టెంబర్ 19 (ఈవార్తలు): వినాయక నవరాత్రుల సందర్భంగా జగిత్యాల మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గణనాథునికి మున్సిపల్ చైర్‌పర్సన్ సమీండ్ల వాణి శ్రీనివాస్, కమిషనర్ సత్యప్రణవ్, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, అధికారులు, సిబ్బంది శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్తర పూజలు నిర్వహించి భక్తులకు అన్నదానం చేశారు. గణనాథుని విగ్రహాన్ని శోభాయాత్రగా నిమజ్జనానికి తరలించారు. మున్సిపల్ కార్యాలయం నుంచి ప్రారంభమైన శోభాయాత్రలో అధికారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు. గణనాథుని నామస్మరణతో శోభాయాత్ర భక్తిశ్రద్ధల మధ్య కొనసాగింది. కార్యక్రమంలో ముని

# ఓయూ ఆర్ట్స్ కాలేజీలో వీజేఎస్ సహాయ కేంద్రం



హైదరాబాద్, సెప్టెంబరు 19 (ఈవార్తలు): ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీలో నూతన విద్యార్థుల ప్రవేశ ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించేందుకు విద్యార్థి జన సమితి విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి నాయకుడు కడారి రమేష్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నూతన విద్యార్థులకు అవసరమైన సమాచారం, సహాయాన్ని అందిస్తున్నారు. ప్రవేశ ప్రక్రియలో విద్యార్థులకు ఎదురవుతున్న సందేహాలు, ధ్రువపత్రాల సమర్పణ, కౌన్సెలింగ్, కోర్సుల ఎంపిక, ఫీజులు తదితర అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేయడంతోపాటు అవసరమైన సహాయం అందజేస్తున్నారు. విద్యార్థి జన సమితి విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి జిల్లాపెల్లి దిలీప్ కుమార్ పాల్గొని నూతన విద్యార్థులతో మాట్లాడి.. ప్రవేశ ప్రక్రియలో విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నా వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. నూతన విద్యార్థులకు అవసరమైన సమాచారాన్ని విశ్వవిద్యాలయ అధికారులు స్పష్టంగా అందించి ప్రవేశ ప్రక్రియను మరింత సులభతరం చేయాలని రమేష్ యాదవ్, జిల్లాపెల్లి దిలీప్ కుమార్ కోరారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఇలాంటి సహాయక కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు. విద్యార్థులకు అండగా నిలవడం విద్యార్థి నాయకత్వం ప్రధాన బాధ్యత అని, విద్యార్థుల హక్కులు, సమస్యలపై నిరంతరం పోరాడుతామని పేర్కొన్నారు.

## టికెట్ అడిగితే బట్టలు చించుకుని హల్చల్

సికింద్రాబాద్, సెప్టెంబర్ 19 (ఈవార్తలు): రైలులో టికెట్ లేకుండా ప్రయాణిస్తూ పట్టుబడిన ఓ యువతి చేసిన హంగామా ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. టికెట్ చూపించమని కోరిన టీటీఈ పైనే సదరు యువతి వేధింపుల ఆరోపణలు చేస్తూ నానా రభస చేసింది. బీహార్‌లోని దానాపూర్ నుంచి సికింద్రాబాద్ వస్తున్న రైలులో ఈ ఘటన చోటుచేసుకుంది. టికెట్ లేకుండా ప్రయాణిస్తున్న సదరు యువతిని టీటీఈ టిక్కెట్ అడగడంతో ఆమె ఒక్కసారిగా ఆగ్రహానికి గురైంది. టీటీఈని బెదిరించడమే కాకుండా, తన దుస్తులను తానే చించుకుని, ఆయన తన పట్ల అసభ్యంగా ప్రవర్తించాడంటూ గట్టిగా అరుస్తూ హైడ్రామా సృష్టించింది. అయితే, ఈ ఘటన మొత్తాన్ని తోటి ప్రయాణికులు తమ మొబైల్ ఫోన్లలో వీడియో తీయడంతో ఆమె నాటకం బట్టబయలైంది. సమాచారం అందుకున్న రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్పీఎఫ్) సిబ్బంది అక్కడికి చేరుకుని, వీడియో ఆధారాలను పరిశీలించి యువతిదే తప్పని నిర్ధారించారు. అనంతరం ఆమెకు రూ.1,000 జరిమానా విధించి వదిలిపెట్టారు. ప్రస్తుతం ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో విపరీతంగా చక్కర్లు కొడుతోంది.

## 2 వేలు దాటితే క్యాష్ మాత్రమే: పెట్రోల్ డీలర్లు

న్యూఢిల్లీ: నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా అక్టోబర్ 15 నుంచి అమలు చేయనున్న నూతన మర్చంట్ డిస్కౌంట్ రేట్ నిబంధనలపై దేశవ్యాప్తంగా పెట్రోల్ పంప్ నిర్వాహకులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. కొత్త ఫ్రేమ్‌వర్క్ ప్రకారం రూ. 2,000 కంటే ఎక్కువ విలువైన ఇంధన యూపీఐ లావాదేవీలపై వ్యాపారుల నుంచి 0.4 శాతం ఎమ్‌డీఆర్ చార్జీ వసూలు చేయనున్నారు (రూ. 2,000 లోపు లావాదేవీలకు ఎటువంటి చార్జీలు ఉండవు). ఈ నిర్ణయంపై ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా పెట్రోలియం ట్రేడర్స్, ఆల్ ఇండియా పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయి. లీటరుకు తమకు వచ్చే కమిషన్ కేవలం రూ. 2.40 నుంచి రూ. 3.40 వరకు మాత్రమే ఉంటుందని... ఒక్కో పెద్ద లావాదేవీపై 0.4 శాతం చొప్పున ఎమ్‌డీఆర్ చెల్లించాల్సి వస్తే పెట్రోల్ పంప్‌లపై తీవ్ర ఆర్థిక భారం పడుతుందని డీలర్లు పేర్కొంటున్నారు. ఇంధనం అత్యవసర సరుకు అయినందున పెట్రోల్ బంకులకు ఎమ్‌డీఆర్ నుంచి పూర్తి మినహాయింపు ఇవ్వాలని... లేకపోతే అక్టోబర్ 15 నుంచి రూ. 2,000 పైబడిన ఇంధన కొనుగోళ్లకు యూపీఐ డిజిటల్ చెల్లింపులను నిలిపివేసి, కేవలం నగదు రూపంలో మాత్రమే స్వీకరిస్తామని హెచ్చరించారు.



## బీజేపీ ఎమ్మెల్యేపై సైబర్ దొంగల అటాక్

### ఖాతా నుంచి రూ.1.55 లక్షలు మాయం

లక్నో: ఉత్తరప్రదేశ్‌లో బీజేపీకి చెందిన ఓ మహిళా ఎమ్మెల్యే సైబర్ మోసానికి గురయ్యారు. కౌశాంబి జిల్లా చైల్ నియోజకవర్గ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పూజా పాల్ బ్యాంకు ఖాతా నుంచి గుర్తుతెలియని వ్యక్తులు రూ.1.55 లక్షలు అపహరించారు. ఈ ఘటనపై ఆమె ప్రయాగ్‌రాజ్‌లోని ధూమన్‌గంజ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ప్రయాగ్‌రాజ్‌లోని ధూమన్‌గంజ్ పరిధిలో గల యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచీలో పూజా పాల్‌కు బ్యాంక్ ఖాతా ఉంది. ఆగస్టు 22 నుంచి సెప్టెంబర్ 13వ తేదీ మధ్య కాలంలో ఆమె ఖాతా నుంచి ఫోన్‌పే, యూపీఐ ద్వారా పలు విడతలుగా నగదు విత్‌డ్రా అయినట్లు గుర్తించారు. సెప్టెంబర్ 14న తన ఖాతా స్టేట్‌మెంట్‌ను తనిఖీ చేసుకున్న సమయంలో ఈ మోసం వెలుగులోకి వచ్చింది. ఈ వ్యవహారంపై బాధిత ఎమ్మెల్యే, శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన ఐఫోన్ 17 ఎయిర్‌ను హ్యాకర్లు హ్యాక్ చేసి, బ్యాంకు వివరాలతో పాటు వ్యక్తిగత డేటాను తస్కరించి ఈ మోసానికి పాల్పడి ఉంటారని పూజా పాల్ అనుమానం వ్యక్తం చేశారు.

## విధ్వంసకర శక్తిగా మారాలి: కిమ్

ప్యాంగ్యాంగ్: ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్ తమ దేశ సైనిక సామర్థ్యాన్ని మరింత పెంచే దిశగా కీలక ఆదేశాలు జారీ చేశారు. తమ ఫిరంగి దళాలు (ఆర్టిలరీ) అత్యంత కేంద్రీకృత, విధ్వంసకర సామర్థ్యాలను కలిగి ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ వారంలో బుధవారం నుంచి శుక్రవారం వరకు ఆయన పలు కీలక ఆయుధ కర్మాగారాలను సందర్శించారు. ఈ పర్యటన వివరాలను ఉత్తర కొరియా అధికారిక మీడియా వెల్లడించింది. 'కొరియన్ సెంట్రల్ న్యూస్ ఏజెన్సీ' (కేసీఎన్ఏ) కథనం ప్రకారం.. రూలింగ్ వర్కర్స్ పార్టీ సెంట్రల్ మిలిటరీ కమిషన్ వైస్ ఛైర్మన్ పాక్ జోంగ్ చోన్‌తో సహా పలువురు ఉన్నతాధికారులు కిమ్ వెంట ఉన్నారు. ఈ సందర్భంగా కిమ్ మాట్లాడుతూ.. "యుద్ధాన్ని నిరోధించడం, యుద్ధంలో పోరాడటం అనే రెండు కీలక బాధ్యతలను మన ఆర్టిలరీ సమర్థంగా నిర్వర్తించాలి. ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన సైన్యాన్ని నిర్మించాలనే పార్టీ వ్యూహాత్మక విధానంలో ఆయుధ పరిశ్రమ కీలక పాత్ర పోషించాలని కిమ్ ఉద్ఘాటించారు. దాడి, రక్షణ ఆయుధాలలో కృత్రిమ మేధ (ఏఐ) స్థాయిని పెంచడం, ఫిరంగి ఆయుధాల ఆటోమేషన్, ఉత్పత్తి సామర్థ్యాన్ని మెరుగుపరచడం వంటి విధానపరమైన పనులను ఆయన నిర్దేశించారు. కిమ్ 600 ఎంఎం, 240 ఎంఎం మల్టిపుల్ రాకెట్ లాంచర్లు, డ్రోన్‌లను ఉత్పత్తి చేసే ఫ్యాక్టరీలను సందర్శించి ఉండవచ్చని సియోల్‌కు చెందిన కొరియా డిఫెన్స్ అండ్ సెక్యూరిటీ ఫోరమ్ సెక్రటరీ జనరల్ షిన్ జోంగ్-వూ విశ్లేషించారు.

# ఢిల్లీ వర్సిటీ ఎన్నికల్లో ఏబీవీపీ హవా

### నాలుగు కీలక పదవుల్లో 3 కైవసం



న్యూఢిల్లీ: ఢిల్లీ విశ్వవిద్యాలయ విద్యార్థి సంఘం (డీయూఎస్‌యూ) 2026 ఎన్నికల్లో బీజేపీ అనుబంధ విద్యార్థి విభాగం అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ప్రభంజనం సృష్టించింది. నాలుగు కీలక కేంద్ర ప్యానెల్ స్థానాల్లో మూడింటిని కైవసం చేసుకుని తన ఆధిపత్యాన్ని చాటుకుంది. ఈ ఫలితాల నేపథ్యంలో, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఇటీవల నిర్వహించిన "ఛాత్రోం కీ గూంజ్" (విద్యార్థుల ప్రతిధ్వని) కార్యక్రమాన్ని లక్ష్యంగా చేసుకుని బీజేపీ నేతలు వ్యంగ్యాస్త్రాలు సంధిస్తున్నారు. ఈ విజయంపై కేంద్ర మంత్రి జేపీ నడ్డా స్పందిస్తూ, "నాకు గూంజ్ (ప్రతిధ్వని) వినిపించలేదు, కానీ ధమాకా (పేలుడు) మాత్రం స్పష్టంగా వినిపించింది" అని ఎద్దేవా చేశారు. రాహుల్ ప్రచారాన్ని "ఝూట్ కీ గూంజ్" (అబద్ధాల ప్రతిధ్వని) అని అభివర్ణిస్తూ, ఈ తీర్పు కాంగ్రెస్‌పై విద్యార్థులకు ఉన్న అభిప్రాయానికి నిదర్శనమని పలువురు బీజేపీ నేతలు పేర్కొన్నారు. తాజా ఎన్నికల ఫలితాల ప్రకారం, ఏబీవీపీ అభ్యర్థి యశ్ దబాస్ 24,576 ఓట్లు సాధించి, తన సమీప ప్రత్యర్థి, ఎన్ఎస్‌యూఐ అభ్యర్థి విజయ్ శంకర్ మీనాపై 2,053 ఓట్ల ఆధిక్యంతో అధ్యక్షుడిగా విజయం సాధించారు. కార్యదర్శిగా రియా ఛావడి, సంయుక్త కార్యదర్శిగా లక్ష్య రాజ్ సింగ్ కూడా ఏబీవీపీ తరఫున గెలుపొందారు. అయితే, ఉపాధ్యక్ష పదవిని మాత్రం గతంలో ఎన్ఎస్‌యూఐ సభ్యుడిగా ఉండి, ప్రస్తుతం స్వతంత్రంగా పోటీ చేసిన దీపాన్షు షోకీన్ దక్కించుకున్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ప్రహ్లాద్ జోషి, కిరణ్ రిజిజు, ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా తదితరులు ఏబీవీపీకి అభినందనలు తెలిపారు. "దేశమే ప్రథమం" అనే సిద్ధాంతంతో విద్యార్థి సంక్షేమమే లక్ష్యంగా ఏబీవీపీ పనిచేస్తోందని వారు కొనియాడారు. మరోవైపు, కాంగ్రెస్ అనుబంధ విద్యార్థి సంఘం ఎన్ఎస్‌యూఐ ఈ ఎన్నికల్లో ఒక్క సీటును కూడా గెలుచుకోలేకపోయింది. గత ఏడాది ఉపాధ్యక్ష పదవిని దక్కించుకున్న ఎన్ఎస్‌యూఐ, ఈసారి ఘోర పరాజయాన్ని మూటగట్టుకోవడం గమనార్హం.

## టాయిలెట్లలో 10 నిమిషాలే టైం లిమిట్

### టైం దాటితే ఆటోమేటిక్‌గా తెరుచుకునే డోర్లు




న్యూయార్క్: అమెరికాలోని న్యూయార్క్ నగరంలో నూతనంగా ఏర్పాటు చేసిన కొన్ని పబ్లిక్ టాయిలెట్లు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. వీటిని 'స్మార్ట్ టాయిలెట్లు'గా వ్యవహరిస్తున్నారు. వీటి ప్రత్యేకత ఏమిటంటే, వీటిని కేవలం 10 నిమిషాల సమయం వరకు మాత్రమే ఉపయోగించుకోవడానికి వీలుంటుంది. నిర్ణీత సమయం ముగియగానే తలుపులు వాటంతట అవే తెరుచుకుంటాయి. న్యూయార్క్ నగరంలో ప్రజల అవసరాలకు తగ్గట్టుగా పబ్లిక్ రెస్ట్‌రూమ్‌ల కొరత తీవ్రంగా ఉండటంతో, ఈ సమస్యను పరిష్కరించడానికి అధికారులు వివిధ ప్రాంతాల్లో రోబోటిక్/స్మార్ట్ టాయిలెట్లను అందుబాటులోకి తీసుకువచ్చారు. ప్రజలు వీటిని ఉచితంగా వినియోగించుకోవచ్చు. మొబైల్ ఫోన్ ద్వారా సందేశం పంపడం లేదా ప్రత్యేక కార్డును స్కాన్ చేయడం ద్వారా ఈ టాయిలెట్ తలుపులు తెరుచుకుంటాయి. వినియోగదారుడు లోపలికి వెళ్లిన వెంటనే టైమర్ ప్రారంభమవుతుంది. అయితే, ఈ స్మార్ట్ టాయిలెట్లలో విధించిన 10 నిమిషాల కాలపరిమితిపై ప్రస్తుతం నెట్టింట పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది. "ఒకవేళ పది నిమిషాల్లోపు పని పూర్తి కాకపోతే పరిస్థితి ఏంటి? ఎవరికైనా అనారోగ్య సమస్యలు తలెత్తితే వారి పరిస్థితి దారుణంగా ఉంటుంది కదా" అంటూ నెటిజన్లు వ్యంగ్యంగా స్పందిస్తున్నారు. ఈ నిబంధనపై సోషల్ మీడియా వేదికగా మీమ్స్, జోకులు వెల్లువెత్తుతున్నాయి. సాంకేతికత అందుబాటులోకి రావడం మంచి పరిణామమే అయినప్పటికీ, ఇలాంటి నిబంధనలు ఇబ్బందికరంగా మారతాయని పలువురు అభిప్రాయపడుతున్నారు. మొత్తానికి ఈ స్మార్ట్ టాయిలెట్ల అంశం ప్రస్తుతం ఇంటర్నెట్‌లో హాట్ టాపిక్‌గా నిలుస్తోంది.

## అమెరికా వర్సిటీల్లో తగ్గిన విదేశీ విద్యార్థులు

### వీసా జాప్యం, తిరస్కరణలే ప్రధాన కారణాలు




వాషింగ్టన్: అమెరికాలో ఉన్నత విద్య చదవాలనుకునే విదేశీ విద్యార్థులకు పరిస్థితులు ఏమంత ఆశాజనకంగా కనిపించడం లేదు. 2026 విద్యా సంవత్సరానికి అమెరికాలోని సగానికి పైగా కాలేజీలు, యూనివర్సిటీలకు విదేశీ విద్యార్థుల నుంచి వచ్చే దరఖాస్తులు తగ్గినట్లు తాజా సర్వే వెల్లడించింది. వీసాల జారీ ఆలస్యం, వీసా తిరస్కరణలు, కఠినమైన ఇమ్మిగ్రేషన్ నిబంధనలు ఇందుకు ప్రధాన కారణాలుగా ఉన్నాయి. ఈ పరిణామాలతో ముఖ్యంగా భారత్, చైనా నుంచి అమెరికా వెళ్లాలనుకునే విద్యార్థుల్లో ఆందోళన పెరుగుతోంది. అమెరికన్ కౌన్సిల్ ఆన్ ఎడ్యుకేషన్ (ఏసీఈ) 328 మంది ఉన్నత విద్యా సంస్థల సీనియర్ అధికారులతో ఈ సర్వే నిర్వహించింది. ఇందులో 63 శాతం మంది ఇమ్మిగ్రేషన్ ఆంక్షలు, వీసాల రద్దుపై తీవ్రంగా లేదా కొంతమేర ఆందోళన ఉన్నట్లు చెప్పారు. అంతేకాదు.. 36 శాతం మంది ఈ పరిస్థితిని ఎదుర్కొనేందుకు తమ యూనివర్సిటీలు సిద్ధంగా లేవని తెలిపారు. అంతర్జాతీయ విద్యార్థుల సంఖ్య తగ్గడం అమెరికా యూనివర్సిటీల అడ్మిషన్లపైనే కాదు.. వాటి ఆర్థిక పరిస్థితిపైనా ప్రభావం చూపుతుంది. విదేశీ విద్యార్థులను చేర్చుకునే యూనివర్సిటీల అధ్యక్షుల్లో 73 శాతం మంది.. విద్యార్థుల సంఖ్య తగ్గడంతో తమ ఆదాయం కూడా తగ్గిందని తెలిపారు. దీని ప్రభావం ఇప్పటికే కొన్ని క్యాంపస్‌లలో కనిపిస్తోంది. 23 శాతం మంది అధికారులు పరిశోధనలు, విద్యార్థుల సహాయ కార్యక్రమాలకు కేటాయించే బడ్జెట్‌ను తగ్గించినట్లు చెప్పారు. 9 శాతం మంది కొన్ని కోర్సులను మూసివేయడం లేదా ఇతర కోర్సులతో విలీనం చేయాల్సి వచ్చిందన్నారు. మరో 11 శాతం మంది విద్యార్థులకు ఇచ్చే ఆర్థిక సాయం తగ్గినట్లు వెల్లడించారు.

# మహారాష్ట్ర మంత్రికి ఆర్బీఐ షాక్

### డీసీసీబీ నుంచి తొలగించాలని ఆదేశం




లాతూర్: మహారాష్ట్ర సహకార శాఖ మంత్రి బాబాసాహెబ్ పాటిల్‌కు భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్బీఐ) భారీ షాక్ ఇచ్చింది. లాతూర్ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) డైరెక్టర్ల బోర్డు నుంచి ఆయనతో పాటు మరో ఏడుగురు డైరెక్టర్లను తక్షణమే తొలగించాలని ఆర్బీఐ ఆదేశాలు జారీ చేసింది. పదేళ్లకు మించి పదవిలో కొనసాగుతూ నిబంధనలను ఉల్లంఘించినందుకే ఈ చర్యలు తీసుకున్నట్లు స్పష్టం చేసింది. కాగా, మంత్రి పాటిల్ ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ నేతృత్వంలోని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ) వర్గానికి చెందిన నేత కావడం గమనార్హం. బ్యాంకింగ్ నియంత్రణ చట్టం-1949 ప్రకారం, జిల్లా సహకార బ్యాంకుల డైరెక్టర్లుగా ఒక వ్యక్తి గరిష్ఠంగా 10 సంవత్సరాలు మాత్రమే పదవిలో ఉండటానికి అర్హులు. అయితే, ఈ నిబంధనను అతిక్రమించి మంత్రి పాటిల్ సహా ఎనిమిది మంది డైరెక్టర్లు పదవుల్లో కొనసాగుతున్నారని బ్యాంకు సభ్యుడు సతీశ్ శేషారావు జాదవ్ ఈ ఏడాది మే నెలలో ఆర్బీఐకి ఫిర్యాదు చేశారు. సదరు ఫిర్యాదుపై ఆర్బీఐ నుంచి ఎటువంటి స్పందన రాకపోవడంతో, జాదవ్ బాంబే హైకోర్టులోని ఔరంగాబాద్ ధర్మాసనాన్ని ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన న్యాయస్థానం, ఆరు వారాల్లోగా ఫిర్యాదుపై నిర్ణయం తీసుకోవాలని ఆగస్టు 3న ఆర్బీఐని ఆదేశించింది. హైకోర్టు ఆదేశాలతో రంగంలోకి దిగిన ఆర్బీఐ, సంబంధిత డైరెక్టర్ల నుంచి వివరణ కోరింది. ఈ పరిణామాల నేపథ్యంలో ఏడుగురు డైరెక్టర్లు సెప్టెంబర్ 10న తమ పదవులకు రాజీనామాలు సమర్పించారు. అయినప్పటికీ, నిబంధనల ప్రకారం అనర్హులైన డైరెక్టర్లను తొలగించాలంటూ సెప్టెంబర్ 18న లాతూర్ డీసీసీబీకి ఆర్బీఐ అధికారికంగా ఆదేశాలు జారీ చేసింది.

## డిజైర్ సీఎన్‌జీలో ఆటోమేటిక్ గేర్ బాక్స్

ముంబై: కొత్త కారు కొనాలని చూస్తున్న వారికి మారుతీ సుజుకి గుడ్‌న్యూస్ చెప్పింది. స్విఫ్ట్, డిజైర్ సీఎన్‌జీ మోడళ్లలో తొలిసారిగా ఏఎంటీ గేర్‌బాక్స్‌ను తీసుకొచ్చింది. ఫ్యాక్టరీలోనే అమర్చిన సీఎన్‌జీ యూనిట్ తో ఆటోమేటిక్ గేర్‌బాక్స్‌ను అందించడం మారుతి చరిత్రలో ఇదే తొలిసారి. స్విఫ్ట్ సీఎన్‌జీ ఏఎంటీ ప్రారంభ ధర రూ.7.92 లక్షలు కాగా.. డిజైర్ సీఎన్‌జీ ఏఎంటీ ధర రూ.8.53 లక్షలు. ఇవి ఎక్స్‌షోరూమ్ ప్రారంభ ధరలు. సంబంధిత సీఎన్‌జీ మాన్యువల్ వేరియంట్లతో పోలిస్తే ఏఎంటీ మోడళ్ల ధర రూ.35 వేలు ఎక్కువ. స్విఫ్ట్ సీఎన్‌జీ ఏఎంటీను వీఎక్స్ఐ, వీఎక్స్ఐ(ఓ), జెడ్ఎక్స్ఐ వేరియంట్లలో తీసుకొచ్చారు. డిజైర్ సీఎన్‌జీ ఏఎంటీ వీఎక్స్ఐ, జెడ్ఎక్స్ఐ వేరియంట్లలో లభిస్తుంది. సీఎన్‌జీతో ఏఎంటీను అందిస్తున్న దేశంలో రెండో సంస్థగా మారుతి నిలిచింది. ఇప్పటికే టాటా మోటార్స్ ఈ కాంబినేషన్‌ను అందిస్తోంది. స్విఫ్ట్, డిజైర్ సీఎన్‌జీ ఏఎంటీలో 1.2 లీటర్, మూడు సిలిండర్ల జెడ్12ఈ పెట్రోల్ ఇంజిన్ ఉంటుంది. సీఎన్‌జీ మోడ్‌లో ఇది 70 హెచ్‌పీ శక్తి, 102 ఎన్ఎం టార్క్ ఉత్పత్తి చేస్తుంది. 5-స్పీడ్ ఏఎంటీ గేర్‌బాక్స్‌తో ఇంజిన్‌ను జత చేశారు.

## కన్ఫ్యూజన్‌లో మమతాబెనర్జీ



నందిగ్రామ్: పశ్చిమ బెంగాల్ ఉప ఎన్నికల రాజకీయాలు నాటకీయ పరిణామాలతో ఒక్కసారిగా వేడెక్కాయి. శనివారం ఉదయం మమత బెనర్జీకి షాకిస్తూ పోటీ నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించిన రెజీనగర్ అభ్యర్థి రబీఉల్ ఆలమ్ చౌదరి, కొన్ని గంటల వ్యవధిలోనే తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నారు. మమత బెనర్జీ స్వయంగా చొరవ చూపి పట్టుబట్టడంతో ఆయన తిరిగి పోటీలో నిలిచేందుకు అంగీకరించారు. శనివారం ఉదయం, రాష్ట్ర యంత్రాంగం తమ పార్టీ కార్యకర్తలను వేధిస్తోందని, తమకు అధికారిక పార్టీ గుర్తును కేటాయించలేదని ఆరోపిస్తూ రబీఉల్ ఆలమ్ చౌదరి ఉప ఎన్నిక బరి నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించారు. ఈ పరిణామం మమత వర్గంలో తీవ్ర గందరగోళానికి దారితీసింది. అయితే, వెంటనే రంగంలోకి దిగిన మమత బెనర్జీ ఇతర సీనియర్ నాయకులతో కలిసి ఆయనతో చర్చలు జరిపారు. పార్టీ అధిష్ఠానం ఒత్తిడితో తన మనసు మార్చుకున్న రబీఉల్, తాను పోటీలో కొనసాగుతున్నట్లు మధ్యాహ్నం స్పష్టం చేశారు. అక్టోబర్ 6న రెజీనగర్‌తో పాటు నందిగ్రామ్‌లోనూ ఉప ఎన్నికలు జరగనున్నాయి.

## ఇండియా పోస్ట్ గిఫ్ట్‌లు అబద్ధం: పీఐబీ




న్యూఢిల్లీ: సామాజిక మాధ్యమాల్లో 'ఇండియా పోస్ట్' పేరుతో ఒక సందేశం ప్రస్తుతం వేగంగా వైరల్ అవుతోంది. 'డాక్ సేవా గిఫ్ట్స్' అనే పథకం కింద బహుమతులు పంపిణీ చేస్తున్నట్లు ఈ సందేశంలో పేర్కొన్నారు. అయితే, ఈ ప్రచారం పూర్తిగా అవాస్తవమని, ఇది నకిలీ సందేశమని కేంద్ర ప్రభుత్వ అధికారిక సంస్థ ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ) ఫ్యాక్ట్ చెక్ విభాగం స్పష్టం చేసింది. ఇటువంటి మోసపూరిత ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని హెచ్చరించింది. 'డాక్ సేవా గిఫ్ట్స్' పేరుతో ఇండియా పోస్ట్ ఎటువంటి పథకాన్ని ప్రవేశపెట్టలేదని, బహుమతులు లేదా లక్కీ డ్రాలు వంటివి నిర్వహించడం లేదని పీఐబీ తేల్చిచెప్పింది. ఇటువంటి సందేశాలతో పాటు వచ్చే అనుమానాస్పద లింకులు, వెబ్‌సైట్‌లపై క్లిక్ చేయవద్దని ప్రజలకు సూచించింది. వీటి ద్వారా సైబర్ నేరగాళ్లు వ్యక్తిగత సమాచారాన్ని దొంగిలించే ప్రమాదం ఉందని హెచ్చరించింది. ప్రజలు తమ వ్యక్తిగత సమాచారం, బ్యాంక్ ఖాతా వివరాలు, ఓటీపీ, ఆధార్ నంబర్ వంటి సున్నితమైన వివరాలను ఎవరితోనూ పంచుకోవద్దని పీఐబీ విజ్ఞప్తి చేసింది.

## 50 లక్షలతో పెళ్లి.. 45 లక్షల లోన్!

న్యూఢిల్లీ: ఓ యువకుడు తన వివాహ వేడుక విషయంలో తీవ్ర సందిగ్ధంలో పడ్డాడు. సుమారు రూ. 50 లక్షల వ్యయంతో అత్యంత వైభవంగా వివాహం జరిపించాలనుకుంటున్నామని, అందుకోసం దాదాపు రూ. 45 లక్షల మేర అప్పు చేయాలని తల్లిదండ్రులు ఒత్తిడి చేస్తుండటంతో, దిక్కుతోచని స్థితిలో తన సమస్యను సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నాడు. ఈ పోస్ట్ ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారింది. 27 ఏళ్ల ఓ యువకుడు చాలాకాలంగా ఓ యువతిని ప్రేమిస్తున్నాడు. ఇరు వర్గాల పెద్దలను ఒప్పించి కులాంతర వివాహానికి సిద్ధమయ్యాడు. అయితే, అతని తల్లిదండ్రులు సుమారు 1,500 మంది అతిథుల సమక్షంలో రూ. 50 లక్షల భారీ బడ్జెట్‌తో పెళ్లి చేయాలని పట్టుబడుతున్నారు. ఇందులో భాగంగానే రూ. 10 లక్షల విలువైన కారు కొనుగోలును కూడా తప్పనిసరి చేశారు. కాగా, అమ్మాయి తరఫు వారు మాత్రం రూ. 15 లక్షల పరిమితిలో నిరాడంబరంగా పెళ్లి నిర్వహించేందుకు సుముఖత వ్యక్తం చేస్తున్నారు. పెళ్లి ఖర్చుల నిమిత్తం తమకున్న భూమి అమ్మకం కాకపోతే, కుమారుడినే రూ. 45 లక్షలు వరకు వ్యక్తిగత రుణం తీసుకోవాలని తల్లిదండ్రులు సూచించడం చర్చనీయాంశంగా మారింది. అయితే ఇప్పటికే తమ కుటుంబ ఆస్తులు బ్యాంకులో తాకట్టులో ఉన్నాయని, తన తండ్రి పేరిట రూ. 50 లక్షల మేర అప్పులు కూడా ఉన్నాయని ఆ యువకుడు ఆవేదన వ్యక్తం చేశాడు. కుటుంబంలో గతంలో ఎవరికీ ఇంత ఘనంగా పెళ్లి జరగలేదని, ఇది కులాంతర వివాహం కావడంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని తల్లిదండ్రులు వాదిస్తున్నారు.

## 'బ్రిక్స్' అంత గట్టిగ భారత్ స్థానం: డైరెక్టస్

న్యూఢిల్లీ: న్యూఢిల్లీ వేదికగా జరిగిన 18వ బ్రిక్స్ సదస్సు తర్వాత అంతర్జాతీయ వేదికపై భారత్‌కు దౌత్యపరమైన ప్రాధాన్యం మరింత స్పష్టమైందని 'డైరెక్టస్' నివేదిక పేర్కొంది. ముఖ్యంగా 2025 పహల్గామ్ ఉగ్రదాడిని బ్రిక్స్ న్యూఢిల్లీ డిక్లరేషన్‌లో తీవ్రంగా ఖండించడం, సరిహద్దు దాటి ఉగ్రవాదుల కదలికలు, ఉగ్రవాదానికి నిధులు, సురక్షిత స్థావరాలకు వ్యతిరేకంగా స్పష్టమైన వైఖరి తీసుకోవడం భారత్ చాలాకాలంగా ప్రస్తావిస్తున్న అంశాలకు మద్దతు లభించినట్లయిందని తెలిపింది. పహల్గామ్ దాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ దాడిని బ్రిక్స్ దేశాలు తీవ్రంగా ఖండించాయి. ఉగ్రవాదాన్ని ఏ రూపంలో ఉన్నా నేరపూరితమైనదిగా, సమర్థించలేనిదిగా పేర్కొన్నాయి. ఉగ్రవాద చర్యలకు పాల్పడినవారితో పాటు వారికి మద్దతు ఇచ్చేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కూడా డిక్లరేషన్ స్పష్టం చేసింది. అయితే డిక్లరేషన్‌లో పాకిస్థాన్ పేరును నేరుగా ప్రస్తావించలేదు. ఈ అంశాన్ని దాచాల్సిన అవసరం లేదని, అదే సమయంలో అతిగా ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం కూడా లేదని 'డైరెక్టస్' పేర్కొంది. వివిధ భౌగోళిక, రాజకీయ ప్రయోజనాలు ఉన్న దేశాలు కలిసి ఉగ్రవాదంపై ఇలాంటి భాషను అంగీకరించడం భారత్‌కు దౌత్యపరంగా ముఖ్యమైన పరిణామమని విశ్లేషించింది.

ఒయ్యారి చిత్రం



# దీపికలో గ్లోబల్ స్పార్క్ చూశా





బాలీవుడ్ హీరోయిన్ దీపికా పదుకొణే ప్రయాణాన్ని ఉద్దేశించి కన్నడ దర్శకుడు ఇంద్రజిత్ లంకేశ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేసారు. 2006లో రిలీజ్ అయిన ఐశ్వర్య చిత్రం ద్వారా దీపికను వెండి తెరకు పరిచయం చేసిన ఇంద్రజిత్ ఆమెతో ఉన్న పాత అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. దీపికా స్టేట్ లెవెల్ బ్యాడ్మింటన్ ప్లేయర్‌గా ఉన్న రోజుల్లోనే తనకు పరిచయముందని, ఆ తర్వాత తాను దర్శకుడిగా, ఆమె మోడల్‌గా మారామని తెలిపారు. ఐశ్వర్య సినిమా కథ చెప్పడానికి పూజా దద్లానీతో కలిసి మొదటి సమావేశానికి వచ్చిన రోజే దీపిక ప్రతిభ, వృత్తిపట్ల ఉన్న క్రమశిక్షణ తనను ఎంతగానో ఆకట్టుకున్నాయన్నారు. ఖచ్చితంగా పెద్ద స్టార్ అవుతుందని తాను ఆనాడే భావించినట్లు చెప్పుకొచ్చారు. షూటింగ్ సమయంలోనే దీపికలోని దృష్టి, ఆంబిషన్, కష్టపడే తత్వాన్ని గమనించినట్లు ఇంద్రజిత్ తెలిపారు. నువ్వు కన్నడ లేదా బాలీవుడ్‌కే పరిమితం కావు. గ్లోబల్ స్టార్‌గా ఎదిగే సత్తా నీలో ఉంది అని చిత్రీకరణ సమయంలోనే చెప్పానని గుర్తు చేసుకున్నారు. అనుకున్నట్లుగానే ఓం శాంతి ఓమ్ తో బాలీవుడ్ అరంగేట్రం చేసిన దీపిక హాలీవుడ్ వరకు ముద్రను వేసుకుందని ఆనందం వ్యక్తం చేశారు.

# సుప్రియ యార్లగడ్డ బాధ్యతలు

అక్కినేని కుటుంబానికి చెందిన నటి, అన్నపూర్ణ స్టూడియోస్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ సుప్రియ యార్లగడ్డ సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ లో కీలక బాధ్యతలను చేపట్టారు. ఈ నియామకంపై స్పందించిన సుప్రియ సీబీఎఫ్‌సీలో సభ్యురాలిగా అవకాశం రావడం తనకు లభించిన గొప్ప గౌరవంగా భావిస్తున్నట్లు తెలిపారు. ఈ కొత్త ప్రయాణం తనపై మరింత బాధ్యతను పెంచిందని



పేర్కొన్నారు. ఒక సినిమా మేకర్‌గా, ప్రొడ్యూసర్‌గా సినిమాల్లోని కళాత్మక విలువలను కాపాడుతూనే సెన్సార్ బోర్డ్ నియమ నిబంధనలను సక్రమంగా నిర్వహించడానికి ప్రయత్నిస్తానని తెలిపారు. పరిశ్రమలోని సవాళ్లు, సృష్టికర్తల భావోద్వేగాలు తనకు బాగా తెలుసని, అందువల్ల కళాత్మక స్వేచ్ఛకు , బోర్డు మార్గదర్శకాలకు మధ్య సరైన సమతుల్యతను పాటించడం తన ప్రధాన ధ్యేయమని స్పష్టం చేశారు. ఏఎన్నార్ మనవరాలిగా చిన్ననాటి నుంచే సినిమా వాతావరణంలో పెరిగిన సుప్రియ అన్నపూర్ణ స్టూడియోస్ నిర్మాణ నిర్వహణలో క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారు. నిర్మాణం, నటన లాంటి అనేక విభాగాల్లో ఆమెకు దశాబ్దాల అనుభవం ఉంది.

# ప్రళయ కాళరుద్రుడిలా నాని?

నాని హీరోగా శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కుతున్న ప్యారడైజ్ సినిమా ఈనెల 24వ తేదీన ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఇక ఇలాంటి క్రమంలోనే ఈ సినిమా మీద గత సంవత్సర కాలం నుంచి ప్రేక్షకుల్లో విశేషమైన అంచనాలైతే ఉ న్నాయి. ఎప్పుడైతే ఈ సినిమా నుంచి గ్లింప్స్ రిలీజ్ అయిందో అప్పటినుంచి సినిమా మీద అంచనాలు తార స్థాయికి వెళ్లిపోయాయి. దర్శకుడు శ్రీకాంత్ ఓదెల సైతం ఈ సినిమాని నెక్స్ట్ లెవెల్లో నిలుపడానికి తీవ్రమైన ప్రయత్నం చేస్తున్నాడు. తను అనుకున్నట్టుగానే ఈ సినిమా యావత్ ఇండియన్ సినిమా ఇండస్ట్రీని శాసించగలిగే కెపాసిటితో ముందుకు దూసుకెళ్తుందా లేదా అనేది తెలియాల్సి ఉంది... రీసెంట్ గా సినిమా యూనిట్ మొత్తం సినిమాను వీక్షించారట. నాని ఇంట్రడక్షన్ ఫైట్ ప్రతి ఒక్క ప్రేక్షకుడికి గూస్ బంప్స్ తెప్పిస్తుందనే వార్తలు వినిపిస్తున్నాయి. దానికి తోడుగా ఇంటర్వెల్ కి ఒక 20 నిమిషాల ముందు నాని ప్రళయ కాళ రుద్రుడిలా కనిపిస్తారట. ఇప్పటివరకు నానిలో ఎవ్వరు చూడనటువంటి ఒక యాంగిల్ ని ఈ మూవీలో చూడబోతున్నాం అనే న్యూస్ కూడా వినిపిస్తుంది.



# అన్ని భాషలు కనీస మర్యాద: రష్మిక

తనపై వస్తున్న విమర్శలకు రష్మిక తనదైన రీతిలో కౌంటర్ ఇచ్చారు. వివిధ భాషల నటిస్తున్నప్పుడు ఆయా భాషలను, సంస్కృతిని గౌరవించడం అత్యంత ముఖ్యమని రష్మిక అభిప్రాయపడ్డారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న వేర్వేరు ప్రాంతాల అభిమానులు ..విలేకరులు అడిగే ప్రశ్నలకు వారు మాట్లాడే భాషలోనే స్పందించగలిగితే చాలని.. అదే తాను ప్రేక్షకులకు ఇచ్చే కనీస మర్యాద అని పేర్కొన్నారు. భాష అనేది భావవ్యక్తీకరణకు మాధ్యమం మాత్రమేనని.. అందులో యాస కంటే హృదయపూర్వక స్పందనే ముఖ్యమన్నారు. అనవసరమైన కామెంట్లు, నెగెటివిటీపై దృష్టి పెట్టడం కంటే తన పనిపై శ్రద్ధ వహించడమే ఇష్టమని రష్మిక స్పష్టం చేశారు. నటిగా కెమెరా ముందుకు వెళ్లడం.. ఇచ్చిన పాత్రకు న్యాయం చేయడం.. మంచి కథను చెప్పడంలో భాగ స్వామి కావడం..పని పూర్తయ్యాక తిరిగిరావడమే ప్రాథమిక బాధ్యత అన్నారు. ప్రతి సినిమాలోనూ ఎంతోమంది ప్రతిభావంతులు కలిసి పనిచేస్తారని.. ఆ శక్తివంతమైన కలయికే వెండితెరపై మ్యాజిక్ సృష్టిస్తుందన్నారు. ఎవరి విషయాల్లోనూ వేలు పెట్టకుండా నటిగా అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వడమే ఏకైక లక్ష్యమని రష్మిక పేర్కొన్నారు.



# తమిళాన్ని రఫ్ఫాడించిన ఫరియా



సిగ్మాతో కోలీవుడ్ లో అడుగుపెట్టిన తెలుగమ్మాయి ఫరియా అబ్దుల్లా మొదటి సినిమాతోనే ఆకట్టుకుంటోంది. తమిళ భాషను ఎంత చక్కగా.. స్పష్టంగా మాట్లాడటం నేర్చుకుందో ఈ వేదికపై చూసి అందరూ ఫిదా అయ్యారు. అసలు పరాయి భాష అయిన తమిళంలో ఫరియా ఎంత ఆత్మవిశ్వాసంతో మాట్లాడిందో వేదికపై స్పష్టంగా కనిపించింది. వేదికపై మాట్లాడేటప్పుడు తను చూపించిన చొరవ.. తమిళ ఉచ్చారణ అక్కడి ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా లైకా ప్రొడక్షన్స్ అధినేత సుభాస్కరన్‌ను ఉద్దేశించి సరదాగా లవ్వా సుభాస్కరన్ అంటూ చేసిన చిన్న క్యూట్ కామెంట్స్ ఇండస్ట్రీ వర్గాలతో పాటు, తమిళ ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకున్ఏనాయి. ఫరియా చిట్టి మాటలు చిత్ర యూనిట్‌ను కూడా నవ్వించాయి. డెబ్యూ దర్శకుడు జాసన్ సంజయ్ గురించి, అలాగే తన సహ నటుల గురించి మాట్లాడిన ఫరియా సెట్‌లో తమ మధ్య జరిగిన సరదా ముచ్చట్లు, అనుభవాలను తమిళ ప్రేక్షకులతో షేర్ చేసుకున్నారు.

# కత్రినకు పెరుగుతున్న మద్దతు

బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కత్రినా కైఫ్ ఇటీవల అంబానీ ఇంట జరిగిన గణేష్ చతుర్థి వేడుకల్లో తన భర్త విక్కీ కౌశల్‌తో కలిసి హాజరయ్యారు. గత నెలలో ఈ నటి పండంటి మగబిడ్డకు (విహాన్ కౌశల్) జన్మనిచ్చిన తర్వాత చాలా తక్కువగా పబ్లిక్ ఈవెంట్లలో కనిపిస్తూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో వేడుకల్లో కనిపించిన తీరుపై సోషల్ మీడియాలో కొంతమంది నెటిజన్లు (ముఖ్యంగా పురుషులు) బాడీ షేమింగ్‌కు పాల్పడుతూ.. కత్రిన పెరిగిన బరువు- రూపంపై నెగెటివ్ కామెంట్లు చేశారు. ఈ ట్రోలింగ్‌పై నటి ఖుష్బూ సుందర్ తీవ్రంగా స్పందిస్తూ సోషల్ మీడియా వేదికగా మండిపడ్డారు. మహిళల వయస్సును, శరీరాన్ని ఎందుకు పబ్లిక్ డిబేట్ అంశంగా మారుస్తారని సీనియర్ నటీమణి నిలదీశారు. ఒక మగాడికి బట్టతల వస్తే డిస్టింగిష్డ్ అంటారని, అదే మహిళల విషయంలో మాత్రం ప్రతి ముడతను.. పెరిగిన ప్రతి కిలో బరువును తప్పుబడుతూ డబుల్ స్టాండర్డ్స్ ప్రదర్శిస్తున్నారని ప్రశ్నించారు. ప్రసవం, మాతృత్వం అనేది ఒక మహిళకు పునర్జన్మ లాంటిదని... ఆ సమయంలో శారీరకంగా, మానసికంగా ఎన్నో మార్పులు వస్తాయని స్పష్టం చేశారు. ఈ వివాదం కేవలం భారత్‌కే పరిమితం కాకుండా పాకిస్తాన్ వరకు పాకడం గమనార్హం. పాకిస్తానీ కామెంట్లు చేసే డాక్టర్ ఏజాజ్ వారిస్.. కత్రినా రూపంపై విమర్శిస్తూ కించపరిచేలా మాట్లాడారు. ఈ వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపడంతో పాక్ నటి హానియా ఆమిర్ స్పందిస్తూ.. మహిళల శరీరాలు, వయసును వినోదం కోసం, వ్యూస్ కోసం వాడుకోవడం సిగ్గుచేటని... మహిళలు ఎవరికీ సమాధానం చెప్పాల్సిన అవసరం లేదని స్ట్రాంగ్ నోట్ షేర్ చేశారు.





## టీమిండియాకు అందని జెర్సీలు

**ఆదివారం జపాన్‌కు క్రికెటర్లు.. కొందరికి ఇంకా అందని కిట్లు**

నాగోయా వెళ్లేందుకు సిద్ధమవుతున్న భారత పురుషుల క్రికెట్ జట్టుకు చివరి నిమిషంలో కిట్ సమస్యలు ఎదురయ్యాయి. శ్రేయస్ అయ్యర్ నేతృత్వంలోని జట్టు ఆదివారం తెల్లవారుజామున ఢిల్లీ నుంచి జపాన్‌కు బయలుదేరనుంది. అయితే కొందరు ఆటగాళ్లకు సరైన సైజులో అధికారిక కిట్లు ఇంకా అందలేదు. దీనిపై బీసీసీఐ, భారత ఒలింపిక్ సంఘం కిట్ సరఫరాదారు జేఎస్‌డబ్ల్యూ ఇన్‌స్పైర్ మధ్య పలుమార్లు చర్చలు జరిగాయి. చాలా మంది ఆటగాళ్ల కిట్ సైజు సమస్యలు ఇప్పటికే పరిష్కారమయ్యాయి. మిగిలిన కొందరికి కూడా త్వరలో కిట్లు అం దుతాయని సమాచారం. జపాన్‌లో భారత ఆటగాళ్లు రెండు రకాల జెర్సీలు ఉపయోగించనున్నారు. సెప్టెంబర్ 22న జపాన్‌తో జరిగే స్నేహపూర్వక టీ20లో సాధారణ భారత జట్టు కిట్ ధరిస్తారు. సెప్టెంబర్ 28న ప్రారంభమయ్యే ఏషియన్ గేమ్స్ క్వార్టర్ ఫైనల్ నుంచి అధికారిక ఏషియన్ గేమ్స్ జెర్సీ ధరిస్తారు. ఇదే కిట్ సమస్య ఇప్పటికే భారత బృందంలోని మరో ప్రముఖ అథ్లెట్‌పై ప్రభావం చూపింది. షాట్‌పుట్ ఆటగాడు తజిందర్‌పాల్ సింగ్ తూర్‌కు అధికారిక కిట్ అందకపోవడంతో ప్రారంభోత్సవ వేడుకల్లో భారత పురుషుల ఫ్లాగ్‌బేరర్‌గా పాల్గొనలేకపోయాడు. అతడి స్థానంలో కబడ్డీ ఆటగాడు పవన్ సెహ్రావత్‌ను ఎంపిక చేశారు. మరోవైపు పురుషుల క్రికెట్ జట్టు బస విషయంలోనూ బీసీసీఐ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. నిర్వాహకులు కేటాయించిన గదుల్లో క్రికెట్ కిట్ బ్యాగులు పెట్టేందుకు సరిపడా స్థలం లేకపోవడంతో బోర్డు సొంతంగా వసతి ఏర్పాటు చేసింది. మహిళల జట్టు మాత్రం ఐఓఏ ఏర్పాటు చేసిన వసతిలోనే ఉంటోంది. పురుషుల క్రికెట్ పోటీల్లో భారత్‌కు నేరుగా క్వార్టర్ ఫైనల్ బెర్త్ లభించింది. సెప్టెంబర్ 28న గ్రూప్-ఏ రన్నరప్‌తో భారత్ తలపడనుంది. సెప్టెంబర్ 22న జపాన్‌తో టీ20 ముగిసిన తర్వాత భారత జట్టు పూర్తి దృష్టిని ఏషియన్ గేమ్స్ పోరుపై పెట్టనుంది.

## జైస్వాల్‌కు అవకాశాలివ్వాలి




వెస్టిండీస్‌తో జరగనున్న వన్డే సిరీస్‌పై టీమిండియా మాజీ ఆల్‌రౌండర్ ఇర్ఫాన్ పఠాన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్‌కు ఎక్కువ అవకాశాలు ఇవ్వాలని సూచించాడు. 2027 వన్డే ప్రపంచకప్ నాటికి అతడు తగినన్ని మ్యాచ్‌లు ఆడి ఉ ండాలని చెప్పాడు. వెస్టిండీస్‌తో భారత్ మూడు వన్డేల సిరీస్ ఆడనుంది. సెప్టెంబర్ 27 నుంచి స్వదేశంలో ఈ పోటీలు మొదలవుతాయి. ఈ సిరీస్‌లో జైస్వాల్‌కు ఎన్ని అవకాశాలు వస్తాయో చూడాలని ఉందని పఠాన్ అన్నాడు. జైస్వాల్ ప్రస్తుతం భారత జట్టులో బ్యాకప్ ఓపెనర్‌గా ఉన్నాడని పఠాన్ చెప్పాడు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్, రోహిత్ శర్మ తర్వాత అతడు మూడో ఓపెనర్‌గా ఉన్నాడన్నాడు. ఇప్పటివరకు ఆడిన ఆరు వన్డేల్లో జైస్వాల్ రెండు సెంచరీలు చేశాడని గుర్తు చేశాడు. ప్రపంచకప్ సమయానికి బ్యాకప్ ఓపెనర్‌కు తగినంత అనుభవం ఉండాలని చెప్పాడు. ఆసియా క్రీడల్లో భారత్ పూర్తి స్థాయి టీ20 జట్టుతో బరిలోకి దిగనుంది. దీంతో వెస్టిండీస్‌తో వన్డే సిరీస్‌లో కొందరు కొత్త ఆటగాళ్లకు అవకాశం దక్కింది. నితీశ్ కుమార్ రెడ్డి, ఆకిబ్ నబీ, నమన్ ధీర్ వంటి ఆటగాళ్లు తమ సత్తా చూపే అవకాశం ఉందని పఠాన్ అన్నాడు. జురెల్, గుర్నూర్ బ్రార్ కూడా అవకాశాలను ఉపయోగించుకోవాలని చెప్పాడు.

## పుజారా కఠినమైన బ్యాటర్

భారత క్రికెట్‌లో తాను ఎదుర్కొన్న అత్యంత కఠినమైన బ్యాటర్ ఎవరంటే విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ పేర్లు చెప్పలేదు ఆస్ట్రేలియా టెస్టు కెప్టెన్ ప్యాట్ కమిన్స్. మాజీ బ్యాటర్ చతేశ్వర్ పుజారానే తనకు



అత్యంత కష్టమైన ప్రత్యర్థి అని చెప్పాడు. పుజారాను ఔట్ చేయడం 'చిన్న చిన్న గాయాలతో క్రమంగా చావగొట్టినట్లు' అనిపించేదని సరదాగా వ్యాఖ్యానించాడు. ఇటీవల 'ప్రైమ్ వీడియో స్పోర్ట్'తో జరిగిన సంభాషణలో కమిన్స్‌ను వివిధ దేశాల నుంచి తాను ఎదుర్కొన్న కఠినమైన ఆటగాళ్ల పేర్లు చెప్పమని అడిగారు. భారత్ నుంచి పుజారాను ఎంచుకున్నాడు. "పుజారా చాలా కష్టంగా ఔట్ అవుతాడు. అతను 100 డాట్ బాల్స్ ఆడాల్సి వచ్చినా సిద్ధంగా ఉంటాడు. మీకు ఎలాంటి అవకాశం ఇవ్వడు. అతనితో బౌలింగ్ చేయడం అంటే చిన్న చిన్న దెబ్బలతో క్రమంగా చావగొట్టినట్లు ఉంటుంది" అని కమిన్స్ చెప్పాడు. ఆస్ట్రేలియాపై భారత్ సాధించిన 2018-19, 2020-21 బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ విజయాల్లో పుజారా కీలక పాత్ర పోషించాడు.



## ఘనంగా ఆసియా క్రీడలు



# షురూ



**త్రివర్ణ పతాకంతో మెరిసిన పవన్ సెహ్రావత్, మను భాకర్**

**36 క్రీడాంశాల్లో 503 మంది భారత అథ్లెట్ల పోటీ**

జపాన్‌లోని ఐచి-నగోయాలో 20వ ఆసియా క్రీడలు శనివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. పాలోమా మిజుహో స్టేడియంలో జరిగిన ఆరంభ వేడుకల్లో భారత బృందానికి పతాకధారులుగా కబడ్డీ ప్లేయర్ పవన్ సెహ్రావత్, ఒలింపిక్ పతక విజేత మను భాకర్ వ్యవహరించారు. వీరిద్దరూ త్రివర్ణ పతాకాన్ని చేతబూని భారత బృందాన్ని ముందుండి నడిపించారు. ఈ మెగా ఈవెంట్‌లో భారత్ తరఫున 36 క్రీడల్లో 503 మంది అథ్లెట్లు పోటీ పడుతున్నారు. వాస్తవానికి పురుషుల విభాగంలో ఫ్లాగ్ బేరర్‌గా షాట్‌పుటర్ తాజిందర్‌పాల్ సింగ్ తూర్‌ను ఎంపిక చేశారు. అయితే, అతడికి సంబంధించిన సెరిమోనియల్ కిట్ సకాలంలో అందకపోవడంతో వేడుకకు హాజరు కాలేకపోయాడు. దీంతో అతడి స్థానంలో పవన్ సెహ్రావత్‌కు ఈ గౌరవం దక్కింది. గత ఆసియా క్రీడల్లో స్వర్ణం గెలిచిన భారత కబడ్డీ జట్టులో పవన్ సభ్యుడిగా ఉన్నాడు. మహిళల విభాగంలో పతాకధారిగా వ్యవహరించిన మను భాకర్, పారిస్ 2024 ఒలింపిక్స్‌లో రెండు కాంస్య పతకాలు సాధించింది. స్వతంత్ర భారత చరిత్రలో ఒకే ఒలింపిక్స్‌లో రెండు పతకాలు గెలిచిన తొలి అథ్లెట్‌గా ఆమె రికార్డు సృష్టించింది. ఈ క్రీడల్లో ఆమె 10 మీటర్ల ఎయిర్ పిస్టల్, 25 మీటర్ల పిస్టల్, మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్లలో పోటీపడనుంది. గతంలో హాంగ్‌జౌ 2022 ఆసియా క్రీడల్లో 107 పతకాలతో రికార్డు సృష్టించిన భారత్, ఈసారి ఆ ప్రదర్శనను అధిగమించి మరిన్ని పతకాలు సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది.



## రష్యాలో క్రికెట్ సందడి

### ప్రారంభమైన టీ10 లీగ్

RUSSIAN T10

ఫుట్‌బాల్, ఐస్ హాకీ, చెస్ వంటి క్రీడలకు ప్రసిద్ధి చెందిన రష్యాలో ఇప్పుడు క్రికెట్ సందడి మొదలైంది. దేశంలో క్రికెట్‌ను పునరుజ్జీవింపజేయాలనే లక్ష్యంతో రష్యన్ క్రికెట్ ఫెడరేషన్ (క్రికెట్ రష్యా) సరికొత్త టోర్నమెంట్‌కు శ్రీకారం చుట్టింది. 'రష్యన్ టీ10 లీగ్' పేరుతో నిర్వహిస్తున్న ఈ టోర్నమెంట్ శని, ఆదివారాల్లో (సెప్టెంబర్ 19, 20) జరగనుంది. చారిత్రాత్మక లుజ్నికి స్టేడియం ఈ మ్యాచ్‌లకు ఆతిథ్యం ఇస్తోంది. ఈ రెండు రోజుల ఈవెంట్‌లో మొత్తం నాలుగు జట్లు పోటీ పడుతున్నాయి. మాస్కో ఫాక్సెస్, క్రెమ్లిన్ స్టార్స్, కజాన్ ఫాల్కన్స్, సెయింట్ పీటర్స్‌బర్గ్ లయన్స్ టైటిల్ కోసం తలపడనున్నాయి. మొత్తం ఏడు మ్యాచ్‌లు జరగనుండగా, మొదటి రెండు స్థానాల్లో నిలిచిన జట్ల మధ్య ఫైనల్ జరుగుతుంది. ఈ లీగ్ ప్రారంభంపై రష్యన్ క్రికెట్ ఫెడరేషన్ డైరెక్టర్ సంభవ్ జైన్ మాట్లాడుతూ, "ఈ టోర్నమెంట్ కేవలం ఒక క్రీడా పోటీ మాత్రమే కాదు. రష్యా వ్యాప్తంగా క్రికెట్‌ను ప్రోత్సహించడం, కొత్త ఆటగాళ్లను, ప్రేక్షకులను ఆకర్షించడం, క్రీడాభివృద్ధికి మరిన్ని అవకాశాలు సృష్టించడం అనే విస్తృత దృష్టిలో ఇది ఒక భాగం" అని వివరించారు. ఈ టోర్నీలో నాలుగు జట్ల తరఫున మొత్తం 60 మంది ఆటగాళ్లు పాల్గొంటున్నారని, వారి ప్రతిభను ప్రదర్శించడానికి, అనుభవం గడించడానికి ఇది ఒక చక్కని వేదిక అని ఆయన అన్నారు. ఈ టీ10 లీగ్ ద్వారా రష్యాలో తొలిసారిగా ఒక నిర్మాణాత్మక దేశీయ క్రికెట్ క్యాలెండర్ రూపుదిద్దుకుంది. స్థానిక రష్యన్ ఆటగాళ్లు, వివిధ దేశాలకు చెందిన ప్రవాసులు, దక్షిణాసియా దేశస్థులు కలిసి ఈ లీగ్‌లో పాల్గొనడం విశేషం.

### రష్యన్ టీ10 లీగ్ షెడ్యూల్:

**2026 సెప్టెంబర్ 19:**

మ్యాచ్ 1: క్రెమ్లిన్ స్టార్స్ వర్సెస్ కజాన్ ఫాల్కన్స్

మ్యాచ్ 2: మాస్కో ఫాక్సెస్ వర్సెస్ సెయింట్ పీటర్స్‌బర్గ్ లయన్స్

మ్యాచ్ 3: క్రెమ్లిన్ స్టార్స్ వర్సెస్ మాస్కో ఫాక్సెస్

**2026 సెప్టెంబర్ 20:**

మ్యాచ్ 1: కజాన్ ఫాల్కన్స్ వర్సెస్ సెయింట్ పీటర్స్‌బర్గ్ లయన్స్

మ్యాచ్ 2: క్రెమ్లిన్ స్టార్స్ వర్సెస్ సెయింట్ పీటర్స్‌బర్గ్ లయన్స్

మ్యాచ్ 3: కజాన్ ఫాల్కన్స్ వర్సెస్ మాస్కో ఫాక్సెస్

ఫైనల్: మొదటి స్థానం వర్సెస్ రెండో స్థానం

## రో-కో చేయాల్సింది పరుగులే: ఆకాశ్ చోప్రా




వెస్టిండీస్‌తో వన్డే సిరీస్‌కు సిద్ధమవుతున్న భారత జట్టులో రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీపై మాజీ క్రికెటర్ ఆకాశ్ చోప్రా కీలక వ్యాఖ్యలు చేశాడు. 2027 వన్డే ప్రపంచకప్‌కు ఏడాది మాత్రమే ఉండటంతో.. ఈ ఇద్దరు సీనియర్ బ్యాటర్ల నుంచి ప్రధానంగా పరుగులను మాత్రమే ఆశిస్తున్నామని చెప్పాడు. రోహిత్, కోహ్లి ఫామ్‌లోకి వస్తే మ్యాచ్‌లను గెలిపించగలరని పేర్కొన్నాడు. వెస్టిండీస్‌తో మూడు వన్డేల సిరీస్‌కు రోహిత్, కోహ్లి ఇద్దరూ 15 మంది సభ్యుల జట్టులో చోటు దక్కించుకున్నారు. శు భ్‌మన్ గిల్ కెప్టెన్‌గా వ్యవహరించనుండగా.. కేఎల్ రాహుల్ వైస్ కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. ఆసియా క్రీడల్లో శ్రేయస్ అయ్యర్ పాల్గొంటుండటంతో రాహుల్‌కు ఈ బాధ్యతలు అప్పగించారు. జట్టు ఎంపికపై కూడా చోప్రా సంతృప్తి వ్యక్తం చేశాడు. అందుబాటులో ఉన్న ఆటగాళ్లతో మంచి జట్టును ఎంపిక చేశారని అన్నాడు. రిషబ్ పంత్ స్థానంలో రెండో వికెట్ కీపర్‌గా ధ్రువ్ జురెల్‌ను తీసుకోవడం కూడా తనకు నచ్చిందని చెప్పాడు. మరోవైపు రవీంద్ర జడేజా వన్డే జట్టులోకి తిరిగి వచ్చాడు. ఆసియా క్రీడల బృందం నుంచి తప్పించి నితీశ్ కుమార్ రెడ్డిని వన్డే జట్టులోకి తీసుకోవడాన్ని చోప్రా ప్రత్యేకంగా ప్రస్తావించాడు. హార్దిక్ పాండ్య అందుబాటులో లేని పరిస్థితుల్లో బౌలింగ్‌తో పాటు బ్యాటింగ్ చేయగల ఆటగాడు అవసరమని చెప్పాడు. ఆల్‌రౌండర్ల స్థానాల్లో పోటీ కూడా ఆసక్తికరంగా ఉ ంటుందని చోప్రా పేర్కొన్నాడు. అక్షర్ పటేల్, రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్ ముగ్గురిలో అందరికీ 2027 ప్రపంచకప్ జట్టులో చోటు దక్కకపోవచ్చని అన్నాడు. ప్రతి అవకాశాన్ని ఆటగాళ్లు సద్వినియోగం చేసుకోవాల్సి ఉంటుందని చెప్పాడు. వెస్టిండీస్‌తో తొలి వన్డే సెప్టెంబర్ 27న తిరువనంతపురంలో జరగనుంది. రెండో మ్యాచ్ సెప్టెంబర్ 30న గువాహటిలో, మూడో వన్డే అక్టోబర్ 3న చండీగఢ్‌లో జరగనుంది.

శ్రావణ వాణి

ప్రజల ఓటు పవిత్రం అంటరు..
గెలిచాక జంపింగ్‌కు రెడీ అయితరు..
ప్రజాశ్రేయస్సుకే పార్టీ మార్పు అంటరు..
ప్రజాతీర్పును నిట్టనిలువునా
బొందపెడ్తరు..

**ఇదే నేటి నైతికత!**
**ఇదే నేటి ప్రజాస్వామ్యం..!!**

పార్టీ మారినా ఫిరాయింపు
కానేకాదంటాడు.. స్పీకర్
పచ్చనోట్లు పంచినా అవినీతి
కాదంటాడు.. లాయర్
ప్రభుత్వాన్ని కూలదోసినా చాణక్యం
అంటాడు.. పొలిటీషియన్
అనైతికతనూ రాజకీయ వ్యూహం
అంటాడు.. అనలిస్ట్

**నిబంధనలున్నాయ్..**
వాటికి నడక లేదు
అనర్హత ఉంది..
అమలుకు అడుగు లేదు
అధికారమే లక్ష్యం..
అడిగేవారు లేరు
ఫిరాయింపు చట్టం..
పనికిమాలిన చట్టం

**"ఓటరు చూసిందిది..!!"**
గా ఎమ్మెల్యే అధికార పార్టీలో చేరిండు..
సీఎంను కలిసి కండువా కప్పుకున్నడు..
కొత్త పార్టీవాళ్లు అంతా
కంగ్రాట్స్ చెప్పిండ్రు..

**"స్పీకర్ తీర్పు ఇది..!!"**
గా ఎమ్మెల్యే పార్టీ మారలేదు..
పార్టీ మారినట్లు ఆధారాల్లేవ్..
కండువా కప్పుకుంటే మారినట్లా?
సాంకేతికంగా అనర్హత కుదరదు!

**"ఓటరు సందేహమిది..!!"**
మేం టీవీల్లో చూసిన దృశ్యాలు తప్పా?
మేం పత్రికల్లో చదివిన వార్త తప్పా?
అసలు మేమే భ్రమపడ్డామా..?






దానం నాగేందర్ వ్యవహారం ఒక వ్యక్తి గురించిన కేసుగా మాత్రమే చూడకూడదు. ఇది పార్టీ ఫిరాయింపుల చట్టం అమలులో ఉన్న వ్యవస్థాగత సమస్యను బయటపెట్టిన ఉదాహరణ. స్పీకర్ నిర్ణయం ఒక వైపు. హైకోర్టు తీర్పు మరో వైపు. అదే వ్యవహారంపై రెండు రాజ్యాంగ సంస్థల స్థాయిలో ఇంత భిన్నమైన ఫలితం వస్తే.. సామాన్యుడు ఎవరిని నమ్మాలి? ఇంకో ఘోరమైన ప్రశ్న ఉంది. ఒక ఫిరాయింపుపై నిర్ణయం తీసుకునేలోపే సంవత్సరాలు గడిచిపోతే.. ఆ ఎమ్మెల్యే పూర్తి కాలం పదవిలో ఉండి, చివరికి అనర్హుడిగా తేలితే.. ఆ మధ్యకాలంలో ప్రజల తీర్పుకు జరిగిన నష్టాన్ని ఎవరు పూడుస్తారు?

అనర్హత పిటిషన్ దాఖలైన వెంటనే నిర్దిష్ట కాలపరిమితిలో విచారణ పూర్తి కావాలి.

నిర్ణయం తీసుకోవడంలో ఉద్దేశపూర్వక ఆలస్యం జరిగితే దానికి బాధ్యత ఉండాలి. స్పీకర్ నిర్ణయం విషయంలో ప్రక్రియ పారదర్శకంగా, కాలపరిమితితో సాగాలి. లేకపోతే ఎన్నికల సంఘానికో, ప్రత్యేక ట్రిబ్యునల్‌కో బాధ్యతను అప్పగించాలి.



# పత్తిత్తు చట్టం.. పత్తేపారం!

**లేకపోతే..**
**ప్రజలు ఓటేస్తారు..**
**నేతలు పార్టీలు మారుతూనే ఉంటారు.**

శ్రావణ్ కుమార్ బొమ్మకంటి
ఎడిటర్, ఎంటెక్, ఎల్ఎల్‌బీ
95812 91919,
94412 91919

ప్రజలు ఓటేస్తారు.. పార్టీని నమ్మి ఓటేస్తారు.. అభ్యర్థిని నమ్మి ఓటేస్తారు. కానీ ఎన్నికైన తర్వాత ఆ ఓటుతో గెలిచిన ఎమ్మెల్యేనే పార్టీ మార్చేస్తే? ఎన్నికల ముందు ఒక జెండా పట్టి.. ఎన్నికల తర్వాత మరో జెండా పట్టినా పదవి మాత్రం అలాగే ఉంటే? ప్రజాస్వామ్యంలో ప్రజల ఓటు విలువ ఎంత? ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన 'పార్టీ ఫిరాయింపుల చట్టం' ఇప్పుడు తానే ప్రశ్నార్థకంగా మారింది. 1985లో రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ ద్వారా పార్టీ ఫిరాయింపులను అరికట్టే నిబంధనలు వచ్చాయి. పార్టీని స్వచ్ఛందంగా వదిలినా, పార్టీ విప్‌కు వ్యతిరేకంగా ఓటేసినా అనర్హతకు అవకాశం కల్పించారు. కాగితంపై చట్టం కఠినంగానే కనిపిస్తుంది. కానీ ఆచరణలో అసలు బలహీనత బయటపడుతోంది. ఫిరాయింపుపై ఫిర్యాదు చేయొచ్చు.. కానీ నిర్ణయం ఎప్పుడో చెప్పాల్సిన గడువు లేదు. అనర్హత కోరవచ్చు.. కానీ పిటిషన్ పెండింగ్‌లో ఉన్నంతకాలం సభ్యత్వం కొనసాగొచ్చు. ఇవే ఈ చట్టానికి ఉన్న అతిపెద్ద లోపాలు. తెలంగాణ పరిణామాలే తాజా ఉదాహరణలు. 2023లో బీఆర్ఎస్ టికెట్‌పై గెలిచిన పలువురు ఎమ్మెల్యేలు 2024లో కాంగ్రెస్‌లో చేరిన వ్యవహారం అనర్హత పిటిషన్ల వరకు వెళ్లింది. ఈ కేసుల్లో నిర్ణయాలపై ఆలస్యం చోటుచేసుకోవడంతో సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని కాలపరిమితి విధించాల్సి వచ్చింది. 2025లో మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలని ఆదేశించగా, 2026లోనూ మరోసారి గడువు విధించాల్సి వచ్చింది. ఇంతకంటే చట్టంలోని బలహీనతకు మరో నిదర్శనం అవసరమా?

దానం నాగేందర్ వ్యవహారం మరింత కీలకం. బీఆర్ఎస్ టికెట్‌పై గెలిచి, అనంతరం కాంగ్రెస్‌లో చేరిన ఆయనపై అనర్హత పిటిషన్లు దాఖలయ్యాయి. స్పీకర్ నిర్ణయాన్ని హైకోర్టు 2026 సెప్టెంబరులో పక్కనపెట్టి ఆయనను అనర్హుడిగా ప్రకటించింది. అంటే ఒక ఎమ్మెల్యే అనర్హుడా కాదా అన్నది తేలడానికి కూడా రాజకీయ వ్యవస్థ నుంచి న్యాయస్థానం వరకు ప్రయాణించాల్సిన పరిస్థితి. మహారాష్ట్రలో శివసేన చీలిక సమయంలోనూ ఇదే సమస్య బయటపడింది. అనర్హత పిటిషన్లు పెద్ద సంఖ్యలో పెండింగ్‌లో ఉండటంతో సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని స్పీకర్ నిర్ణయం తీసుకునేలా చేయాల్సి వచ్చింది. కర్ణాటకలోనూ 2019లో ఎమ్మెల్యేల రాజీనామాలు, అనర్హత పిటిషన్లు, ప్రభుత్వ మనుగడ చుట్టూ ఏర్పడిన సంక్షోభం ఫిరాయింపుల చట్టంలోని ఆచరణాత్మక సమస్యలను బహిర్గతం చేసింది. ఫిరాయింపు జరిగిందా? లేదా? అన్నది మాత్రమే కాదు. ఫిరాయింపు జరిగిందని తేలేలోపు ఆ ఎమ్మెల్యే పదవీకాలం పూర్తయితే? అప్పుడు చట్టం గెలిచిందా? ప్రజల తీర్పు గెలిచిందా? ఫిరాయింపుదారుడికి వెంటనే శిక్ష పడకపోతే, ఆలస్యం కూడా ఒక రకమైన రక్షణగా మారుతుంది. ఎన్నికైన సభ్యుడు ఐదేళ్లలో ఎక్కువ భాగం పదవిలో కొనసాగి, చివర్లో అనర్హత తేలితే ఆ తీర్పు ప్రజల దృష్టిలో ఎంత ప్రభావం చూపుతుంది? ఇదే కారణంగా సుప్రీంకోర్టు కూడా అనర్హత పిటిషన్లను సహేతుకమైన సమయంలో పరిష్కరించాల్సిన అవసరాన్ని పదేపదే గుర్తుచేస్తోంది. 2020 లోనే సాధారణంగా మూడు నెలల వ్యవధిలో నిర్ణయం తీసుకోవాలని సూచించింది. ఆ సూచన సరిపోతుందా? చట్టానికి పళ్లు ఉన్నాయంటారు.. కానీ కొరకడానికి గడువు లేకపోతే ఆ పళ్లు దేనికి?

> **'ఊరంతా చూసిన దాన్ని.. ఊర్లో ఒక్కరే చూడలేదంటే, కండ్లు లేవనుకోవాలా? లేక చూడొద్దని కండ్లు మూసుకున్నాడనుకోవాలా?' ఇలాగే ఉంటున్నాయ్ అధికార పార్టీలకు కొమ్ముకాసే స్పీకర్ల తీర్పులు.**

'ఊరంతా చూసిన దాన్ని.. ఊర్లో ఒక్కరే చూడలేదంటే, కండ్లు లేవనుకోవాలా? లేక చూడొద్దని కండ్లు మూసుకున్నాడనుకోవాలా?' ఇలాగే ఉంటున్నాయ్ అధికార పార్టీలకు కొమ్ముకాసే స్పీకర్ల తీర్పులు. పట్టపగలు.. అందరి కళ్లముందే జరిగింది. టీవీల్లో ప్రత్యక్ష ప్రసారమైంది. పత్రికల్లో పతాక శీర్షికలైంది. బీఆర్ఎస్ గుర్తుపై గెలిచిన ఎమ్మెల్యేలు కాంగ్రెస్ కండువాలు కప్పుకున్నారు అని. అధికార పార్టీ పెద్దల సమక్షంలో చేరికలు జరిగాయి. ఫొటోలు వచ్చాయి. వీడియోలు వచ్చాయి. రాష్ట్రం మొత్తం చూసింది. కానీ.. విచిత్రం ఏంటంటే.. తెలంగాణ ప్రజలకు కనిపించిన పార్టీ మార్పు.. అసెంబ్లీ స్పీకర్‌కు మాత్రం కనిపించలేదు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వెళ్లిన ఎమ్మెల్యేల విషయంలో.. "పార్టీ మారలేదు.. ఆధారాలు లేవు" అనే స్పీకర్ తీర్పు చెప్పినప్పుడు తెలంగాణ సమాజం నివ్వెరపోయింది. ఇదేం విడ్డూరం? ఇదేం ప్రజాస్వామ్యం? ఇదేం రాజ్యాంగ పరిరక్షణ? ప్రజలు చూసింది తప్పా? పత్రికలు రాసింది తప్పా? టీవీలు చూపించింది తప్పా? ఫిరాయింపులపై వచ్చిన పిటిషన్లను విచారించిన స్పీకర్.. కొందరు ఎమ్మెల్యేల విషయంలో చట్టపరంగా ఫిరాయింపు నిరూపితం కాలేదని నిర్ణయించారు. దానికి సాంకేతిక, సాక్ష్యాధారాల అంశాలను కారణాలుగా చూపించారు. కానీ అదే వ్యవహారం న్యాయస్థానం ముందుకు వెళ్లినప్పుడు కథే మారిపోయింది. దానం నాగేందర్ విషయంలో తెలంగాణ హైకోర్టు స్పీకర్ నిర్ణయాన్ని పక్కనపెట్టి అనర్హత వేటు వేసింది. ఒక ఎమ్మెల్యే అధికార పార్టీ నాయకులతో కలిసి కనిపిస్తాడు. అధికార పార్టీ కండువా కప్పుకుంటాడు. ఆ పార్టీ అభ్యర్థిగా మరో ఎన్నికలో పోటీ చేస్తాడు. అయినా.. "ఫిరాయింపు జరగలేదు" అని చెప్పగలిగేంత బలహీనంగా ఉంటే ఇక ఫిరాయింపుల చట్టం ఎందుకు?

**రచయితలకు ఆహ్వానం!**

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.